నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
బుధవారం | 19 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

పర్యావరణాన్ని నాశనం చేసే డంపింగ్ యార్డ్ మాకొద్దు



ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తా

నవతెలంగాణ-నర్సాపూర్ : అటవీ ప్రాంతంలో పల్లెల్లో పర్యావరణాన్ని కలుషితం చేసే డంపింగ్ యార్డ్ మాకొద్దని ప్రముఖ వ్యాపారి వేత పైడి శ్రీధర్ గుప్తా అన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టొద్దని నర్సాపూర్ పట్టణంలో బస్టాండ్ వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండవ రోజుకు చేరింది. ఈ రిలే నిరాహార దీక్షకు ప్రముఖ వ్యాపారివేత్త పైడి శ్రీధర్ గుప్తా హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ అడవులు పచ్చని చెట్లతో కళకళలాడుతాయన్నారు. అటువంటి అడవిలో డంపింగ్ యార్డ్ నిర్మించి ఈ ప్రాంతాన్ని కలుషితం చేయడ సరైంది కాదన్నారు. ఎట్టి పరిస్థితిలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టనివ్వొద్దని ఆయన పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు పంబళ్ల బిక్షపతి, లక్ష్మణ్, తాళ్ల జనార్దన్ గౌడ్, రిజ్వాన్, శంకర్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

డప్పూర్ జాతరలో కుస్తీ పోటీలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

కర్ణాటక సమీపంలో గల డప్పురు గ్రామ శివారు హజ్రత్ పీర్ గైబ్ సాహిబ్ దర్గా ఉర్సు జాతర అంగరంగా వైభవంగా జరుగుతున్నది. జాతరలో భాగంగా మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. పెద్ద ప్రజలు హాజరై కుస్తీ పోటీలను తిలకించారు. ఉదయం ప్రారంభమైన ఈ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మల్లయోధులు పోటీపడ్డారు. మధ్యాహ్నం వరకు 51 కుస్తీ పోటీలు జరిగాయి. ఫైనల్ పోటీలో గుల్బర్గా వాసి పైల్వాన్ బెల్లకేరి సిద్దు విజయం సాధించాడు. దాంతో ఆయనకు 11 తులాల వెండి కడియాన్ని నిర్వాహక కమిటీ సభ్యులు గ్రామ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ రవికుమార్, అశోక్, రవి గౌడ్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు జమీరుద్దీన్, హైమాద్, కుతుబోద్దీన్, ప్రజలు తదితరులున్నారు.

చేర్యాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



-22 వాహనాల స్వాధీనం


నవతెలంగాణ-చేర్యాల

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా ఆ ప్రాంత ప్రజలకు రక్షణ పరంగా తీసుకోవలసిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నమని చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని పెద్దమ్మ గడ్డ ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం సీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ అవగాహన కల్పించడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని, పట్టణంలో కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి ఉంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని అన్నారు. ప్రజలు నూతన చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ అనుమతి ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్ తో సర్చ్ చేయించారు. ప్రజలు సైబర్ నేరాలు పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

22 వాహనాల స్వాధీనం

కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఎలాంటి పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకువెళ్లవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల,కొమురవెళ్లి, మద్దూరు ఎస్ఐ లు నిరేష్,రాజు, షేక్ మహబూబ్, ప్రొఫెషనరి ఎస్ఐ మానస రెడ్డి, చేర్యాల సర్కిల్ పోలీసులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే..మా కర్తవ్యం



-సమాజ సంప్రదాయ కార్యక్రమంలో ఏసీపీ మధు
-ఇబ్రహీంనగర్‌లో మత్తుపదార్థాలపై జాగీలాలతో తనిఖీలు
-అనుమానస్పద వ్యక్తుల సంచారంపై సమాచారమందించాలని సూచన

నవతెలంగాణ-చిన్నకోడూరు

ప్రజల భద్రతే..మా కర్తవ్యమని..ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని ఏసీపీ మధు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో ఏసీపీ ఆధ్వర్యంలో సమాజ సంప్రదాయ కార్యక్రమం నిర్వహించారు. అనుమానస్పద ప్రాంతంలో మత్తుపదార్థాలు, మద్యం, నిషేధిత పోగాకు ఉత్పత్తుల నిల్వలపై నార్కోటిక్ జాగీలాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారించేల కృషి చేస్తామని, ప్రజలు పోలీస్ శాఖకు సహకారమందించాలన్నారు. మత్తుపదార్థాల వల్ల యువత భవిష్యత్తుకు భంగం వాటిల్లుతోందని వాటిని నియంత్రణకు ప్రతి ఒక్కరూ ముందుకురావలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రయోజనాలతో పాటు నిష్ప్రయోజనాలున్నాయని, అతిగా వినియోగించడం ప్రమాదకరమన్నారు.సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే డయల్ 1930 ఫిర్యాదు చేయాలని సూచించారు. రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, భూంపల్లి ఎస్ఐ హరీష్, మిరుదొడ్డి ఎస్ఐ పరశురామ్, రూరల్ సర్కిల్ పోలీస్, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలు, మద్యం..

గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ధృవపత్రాల్లేని 32 ద్విచక్ర వాహనాలు, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో తనిఖీలు చేసి సుమారు 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.


జోగిపేటలో భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట

మాల మహానాడు ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ 86వ వర్థంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అందోల్ మల్లేశం మాట్లాడుతూ.. పాదర్ ఆఫ్ దళిత్ మూమెంట్‌ను స్థాపించి బడుగు బలహీనవర్గాల పక్షాన నిలబడి పోరాడిన రాజకీయ గొప్ప నాయకుడు అని కొనియాడారు. అంటరానితనం, అసమానతలు, బాలికలకు విద్యా సౌకర్యాలు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. తొలితరం ఉద్యమ ంలో నైజాం ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలిచిన బడుగుబలహీన వర్గాల ఉద్యమ శిఖరం అన్నారు. ఈ కార్యక్రమంలో డివి జన్ అధ్యక్షు లు మేతరి కరుణాకర్, మండల అధ్యక్షులు బహుజన ప్రసాద్, ఉపాధ్య క్షులు సటికె రాజు, మున్సిపల్ అధ్యక్షులు పెండ గోపాల్, కార్యదర్శి లక్ష్మన్, కోశాధికారి చెట్ల య్య, దుర్గయ్య, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో తెలంగాణ బంజారా కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వ ర్యంలో శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలు ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథి గా హాజరై, సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, సేవాలాల్ మహరాజ్ జీవితం మానవతా విలువలకు ప్రతీక అని, బంజారా సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచిం చారు. ఆయన చూపిన మార్గంలో సమాజ సేవను కొనసా గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రి ఖర్చు భరించలేక భర్తను హత్య చేసిన భార్య



నవతెలంగాణ-పాపన్నపేట

ఆస్పత్రి ఖర్చులు భరించలేక.. ఓ మహిళ అల్లుడితో కలిసి భర్తను హత్య చేసింది. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని బాచారం గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాచారం గ్రామానికి చెందిన కర్రెల ఆశయ్య(45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 15న పొలం వద్ద ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో కాలుకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. నడవలేని స్థితిలో ఉన్న ఆశయ్య ఏ పనీ చేయలేడని, వైద్యానికి డబ్బులు ఖర్చు అవుతాయని భావించిన భార్య శివమ్మ అల్లుడు రమేష్‌తో కలిసి ఆదివారం అర్ధరాత్రి సమయంలో టవల్‌తో గొంతుకు ఉరి బిగించి చంపేశారు. అనుమానం వచ్చిన గ్రామస్తులు, బంధువులు ఆశయ్య గొంతు వద్ద పరిశీలించగా.. కమిలిన గాయం కనిపించింది. అంత్యక్రియలు చేయకుండా అడ్డుకుని, భార్య, అల్లుడిని నిలదీయడంతో విషయం చెప్పారు. రాత్రి సమయంలో పోలీసులకు విషయం తెలియజేయడంతో.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కేసీఆర్ బర్త్ డే పై తప్పుడు ప్రచారం తగదు



నవతెలంగాణ-కొండాపూర్

కొండాపూర్ మండంలో కేసీఆర్ బర్త్ డే కార్యక్రమాలు చేపట్టలేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభా కర్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో పెద్ద ఎత్తున కేసీఆర్ జన్మదిన వేడుకలు జరిగాయని.. నియోజకవర్గ కేంద్రం సమీపంలో ఉండడంతో కొండాపూర్ మండల కార్యకర్తలమంతా అక్కడికి తరలి వెళ్లామన్నారు. కానీ కొన్ని పత్రికల్లో అసలు బర్త్ డేనే జరగలేదని ప్రచురిం చడం సరికాదన్నారు. అనంతసాగర్, సైదాపూర్‌లో పుట్టినరోజు వేడుకలు చేసి నా.. మీడియాకు సమాచారం ఇవ్వలేదన్నారు. కొంత మంది పనిగట్టుకొని బీఆర్ ఎస్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు.

పాలకులది తల కిందుల సిద్ధాంతం

- సమాఖ్య రాజ్యాల్లో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత
- ఐఎంఎఫ్, వరల్డ్‌బ్యాంక్ పెత్తనంతో కార్పొరేట్లకు పెద్దపీట
- సంక్షోభాలకు పెట్టుబడిదారి విధానం పరిష్కారం చూపలేదు
- కార్మికవర్గ పాలనలోనే శాశ్వత పరిష్కారం
- కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్
- ప్రతి బడ్జెట్‌లోనూ నూతన ఆర్థిక విధానాల ఎఫెక్ట్
- రాబోయేది పోరాటాల కాలం...విజయాలు కార్మిక వర్గానివే
- సెమినార్‌లో రాజకీయ విశ్లేషకులు పాపారావు





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పాలకులు అనుసరిస్తున్నది 'తలకిందుల సిద్ధాంతం' అని, సమాఖ్య రాజ్యాల్లో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని, ఆ తర్వాత ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు పెత్తనం మొదలయ్యాక కార్పొరేట్ల లాభాలకు పెద్దపీట వేస్తూ కార్మికుల సంక్షేమానికి కోతలు విధిస్తూ హక్కుల్ని కాలరాస్తున్నారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పాపారావు అన్నారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో "కేంద్ర బడ్జెట్-కార్మిక వర్గంపై ప్రభావం" అనే అంశంపై మంగళవారం కేవల్ కిషన్ భవన్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన పాపారావు మాట్లాడుతూ దేశంలో 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు ప్రభావానికి లోబడే కేంద్ర బడ్జెట్లు రూపొందించబడుతున్నాయన్నారు. కార్మికులు బాగుంటే సమాజం బాగుంటుందన్న భావనకు భిన్నంగా ప్రస్తుతం కార్పొరేట్లు బాగుంటే సమాజం బాగుంటుందన్న తిరోగమన సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్లు లాభాలు గడించాలంటే కార్మికులకిస్తున్న జీతభత్యాల్ని తగ్గించి హక్కులు లేకుండా చేయాలనే తప్పుడు సిద్ధాంతాన్ని కేంద్రం అమలు చేస్తూ వస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను రాయితీ కల్పించినప్పటికీ దాని వెనకాల కార్పొరేట్ల ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న విషయాల్ని మధ్య తరగతి వర్గం గమనించాల్సిన అవసరముందన్నారు. పన్ను రాయితీ ఇవ్వడం వల్ల లక్ష కోట్ల ఆదాయాన్ని కేంద్రం కోల్పోయినట్లుగా చెబుతున్నారన్నారు. ఆ లక్ష కోట్ల ఆదాయాన్ని కార్పొరేట్లపై పన్నులు వేసి లాబట్టాల్సిన కేంద్రం ఆ దిశగా బడ్జెట్‌లో చెప్పలేదన్నారు. అంటే పేదలకు ఇస్తున్న సంక్షేమంలో కోత విధించి ఆ లక్ష కోట్ల లోటును బర్తీ చేసేందుకు కేంద్రం ఎత్తులు వేస్తుందన్నారు. పన్ను రాయితీ వల్ల కలిగే లాభం కంటే ధరల పెరుగుదల వల్ల ఆదాయ పన్ను చెల్లించే కుటుంబాలపై పడిన భారాలు అధికంగా ఉన్నాయన్నారు. విద్య, వైద్యంపై పెట్టే ఖర్చులు కూడా 14 శాతం వరకు పెరిగాయన్నారు. మరో పక్క కార్పొరేట్లపై వేసే పన్నుల్ని మాత్రం తగ్గిస్తూ వచ్చారన్నారు. ఏడాదికి 1.45 లక్షల కోట్లపైనే కార్పొరేట్లకు పన్నులు తగ్గించడం వల్ల ఇప్పటి వరకు రూ.8 లక్షల కోట్ల వరకు రాయితీలిచ్చారన్నారు. కార్పొరేట్లకు ఎన్ని రకాల పన్నులు తగ్గించినా రాయితీలిచ్చినా రుణాల్ని మాఫీ చేసినా దేశంలో పెట్టుబడులు, ఉత్పత్తి పెరగలేదన్నారు. అందుకే ఇన్నాళ్లుగా కార్పొరేట్లకు ఇస్తూ వచ్చిన 14 రకాల ప్రొడక్షన్ లింక్‌డు ఇన్సెంటీవ్స్‌ను నిలుపుదల చేయబోతున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచకుండా భారాలు వేస్తూ పోవడం వల్ల వస్తు ఉత్పత్తి జరిగినా వినియోగం కావట్లేదన్నారు. ఆర్థిక సంక్షోభాలకు పెట్టుబడిదారి విధానాలు పరిష్కారం చూపలేవని, కేవలం కార్మిక వర్గ నేతృత్వంలోని సిద్ధాంతాలు మాత్రమే శాశ్వత పరిష్కారాలు చూపగలవన్నారు. సంక్షోభాలకు పరిష్కారం చూపకపోతే ప్రజల్లో తిరుగుబాటు వచ్చి శ్రీలంకలో కమ్యూనిస్టులకు అధికారం కట్టబెట్టారన్నారు. దేశంలోనూ రాబోయే కాలమంతా పోరాటాల కాలమని, కార్మికులు, కష్టజీవుల రాజ్యం వచ్చే అవకాశాలున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్పొరేట్లకు ఊడిగం చేసే బడ్జెట్ : వక్తలు

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు ఊడిగం చేసే విధంగా ఉందని సీఐటీయూ, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లిఖార్జున్, బి.ప్రసాద్ అన్నారు. ఆదాయ పన్ను రాయితీ పేరిట మధ్య తరగతి ప్రజల ఓటుబ్యాంకును కాపాడుకునేందుకు బీజేపీ ప్రయత్నించిందన్నారు. పన్ను రాయితీ కంటే ప్రభుత్వం ధరలు పెంచి వేస్తున్న భారాలు భరించలేని విధంగా ఉన్నాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల్ని హరిస్తూ సంక్షేమ పథకాలకు కోత పెడుతున్నారన్నారు. పని గంటలు పెంచి యాజమాన్యాల దోపిడికి వెసులుబాటు కల్పిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి నిధుల్ని కోత పెట్టి గ్రామీణ ప్రజలకు పని లేకుండా చేస్తున్నారన్నారు. కార్పొరేట్ శక్తులకు ఇస్తున్న రాయితీలు, అప్పుల మాఫీ గురించి ప్రజలు ఆలోచించకుండా ఉండేందుకే మధ్య తరగతి ప్రజలకు పన్ను రాయితీ బూచీ చూపిస్తున్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి, ఉద్యోగ కల్పన వంటి కీలకమైన అంశాలకు బడ్జెట్‌లో ఏలాంటి పరిష్కార మార్గాల్ని ప్రభుత్వం చూపలేకపోయిందన్నారు. బడ్జెట్‌లోని డొల్లతనాన్ని ప్రజల్లో ఎండగడుతూ అవగహన కల్పించేందుకు సెమినార్లు, సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌కు సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, రామచంద్రం, రాజయ్య అధ్యక్షత వహించారు. ఈ సెమినార్‌లో రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజు, సీఐటీయూ, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శులు జి.సాయిలు, ఎం.నర్సింహులు పాల్గొన్నారు.

నక్కవాగులో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థ జలాల పారబోత



రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న పిసిబీ అధికారులు

నవతెలంగాణ-పటాన్‌చెరు

నక్కవాగులోకి నేరుగా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థ జలాలను పారబోస్తున్న ట్యాంకర్‌ను పీజీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మండలంలోని ముత్తంగి శివారంలో గల జాతీయ రహదారి పక్కన ఉన్న ఉడిపి హెూటల్ నిర్వాహకులు హెూటల్‌లోని సెప్టిక్ ట్యాంక్ వ్యర్థ జలాలను మంగళవారం ముత్తంగి గ్రామపరిధిలోని జాతీయ రహదారిపై నక్కవాగు బ్రిడ్జి పైనుంచి సెప్టింక్ ట్యాంక్ వ్యర్థజలాలను పైపు ద్వారా నేరుగా వాగులోకి వదులుతున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పీసీబీ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ ట్యాంకర్ నుంచి వ్యర్థ జలాలను వదలకుండా అడ్డుకున్నారు. ఈ వ్యర్థాలు ఎక్కడినుంచి తెచ్చారని డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించారు. సంబంధిత వాహన డ్రైవర్ ముత్తంగిలోని ఉడిపి హెూటల్‌కు సంబంధించిన వ్యర్థాలని తెలిపాడు. వాహనం నుంచి శాంపిల్స్ సేకరించారు. పీసీబీ ఈఈ గీతా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉడిపి హెూటల్ నిర్వాహ కులను వాగులోకి వ్యర్థాలు పారవేయొద్దని హెచ్చరించారు. శాంపిల్స్ ఫలితాలు వచ్చాక ఆ నీటిలో హానికర అవశేషాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కాలుష్యం నుంచి జలవనరులను కాపాడేందుకు పీసీబీ శాఖ ప్రత్యేక బృందాలు నిరంతరం తిరుగుతున్నాయని పీసీబీ ఈఈ తెలిపారు.

వ్యవసాయ కార్మికులకు రూ.12000 వెంటనే ఇవ్వాలి



ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి
బడ్జెట్‌లో ఉపాధి హామికి రూ.2,50,000 కోట్లు కేటాయించాలి
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్

నవతెలంగాణ-సంగారెడ్డి

వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.12000 వెంటనే ఇవ్వాలని.. బడ్జెట్‌లో ఉపాధి హామికి రూ.2,50,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు విడాలని హితవు పలికారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, ఇండ్ల స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2,50,000 కోట్లు కేటాయించాలని ప్రతీ ఒక్కరికి ఏడాదిలో 200 రోజుల పనులు, రోజు కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తే ప్రజా ఉద్యమాలకు గురి కావల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామచందర్,ఎం.నర్సిములు మాట్లాడు తూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మి కులకు సంవత్సరానికి రూ.12,000 రూపాయల హామీని అమలుచేసి మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.ఏ షోబు, జిల్లా కమిటీ సభ్యులు జి.నర్సింలు, సుజాత,ఎం.రాజు, అమ్ము తమ్మ, ప్రభాకర్, శేఖర్, మల్లేష్, దేవసాయం, దశరథ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను డ్యూటీలోకి తీసుకోవాలి

- వారిని పర్మినెంట్ చేయాలి
- సీఐఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్
- ఎంఆర్ఎఫ్ కార్మికులకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ
- కలెక్టరేట్ ముందు ధర్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

సదాశివపేట ప్రాంతంలో ఎంఆర్ఎఫ్ ఏపీఎల్ పరిశ్రమలో గత నాలుగేండ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను అకస్మాత్తుగా తొలగించడం దుర్మార్గమని ఎంఆర్ఎఫ్ యాజమాన్యం తక్షణమే కార్మికులను డ్యూటీలోకి తీసుకొని వారిని పర్మనెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను తక్షణమే డ్యూటీలోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేకే భవన్ నుండి కలెక్టరేట్ వరకు కార్మికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఎంఆర్ఎఫ్ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురి చేసి వారిని డ్యూటీల నుండి తొలగించడం దుర్మార్గమన్నారు. గత నాలుగేండ్ల నుంచి కంపెనీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డ కార్మికులను ఎలా తొలగిస్తారని యజమాన్యాన్ని ప్రశ్నించారు. ఎంఆర్ఎఫ్ యజమాన్యం ఇష్టానుసారంగా ప్రవర్తించడం కార్మిక చట్టాలను నిర్దాక్షణంగా ఉల్లంఘించడమే అన్నారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాల న్నారు. సమస్య గురించి కార్మికులు అడిగితే వారిని డ్యూటీ నుంచి తొలగించడం అంటే కార్మిక హక్కులను యజమాన్యం కాలరాస్తున్నదన్నారు. తక్షణమే కార్మికులను డ్యూటీలోకి తీసుకొని కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సీఐటీయూ అండదండలు ఎంఆర్ఎఫ్ అంకినపల్లి పరిశ్రమ కార్మికులకు ఉంటాయన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేశం, జీ.సాయిలు, సీఐటీయూ జిల్లా నాయకులు రాజయ్య, వి.ప్రవీణ్ కుమార్, మహిపాల్, రాజిరెడ్డి, నాగేశ్వరంరావు, శ్రీనివాస్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలు



డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిలిపి వేసే వరకు
అన్ని ప్రజాసంఘాల మద్దతుతో కొనసాగిస్తాం
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-గుమ్మడిదల

డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిలిచిపోయేంతవరకు సీపీఐ(ఎం).. అన్ని ప్రజా సంఘాల మద్దతు, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన నిరవధిక సమ్మెలు కొనసాగించాలని జిల్లా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కే.జయరాజు సూచించారు. మంగళవారం నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గుమ్మడిదల నల్లవల్లి ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం అయిందన్నారు. మండల పరిధిలోని రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని డంపింగ్ యార్డ్ విషయంలో పునరాలోచన చేసి ఈ ప్రాంతం నుండి ఎత్తివేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య మాట్లాడుతూ.. నల్లవల్లి ప్యారానగర్ గుమ్మడిదల మండల ప్రజలు డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న తీరు హర్షణీయమన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఇలాగే కొనసాగించాలన్నారు. కేవీపీఎస్ నాయకులు అతిమేల మాణిక్యం మాట్లాడుతూ.. చైతన్యవంతం కలిగిన యువకులు, మహిళలు రైతులు ప్రాంతంలో ఉన్నారని ఇలాంటి ప్రాంతానికి డంపింగ్ యార్డ్ తీసుకురావడం దురదృష్టకరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి ఎత్తివేసే దిశగా అడుగులు వేయాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) అనుబంధ సంఘాలు, టీఐడీసీ పరిశ్రమ న్యూ ల్యాండ్ సీఐటీయూ పరిశ్రమ కార్మిక సంఘాలు, బ్రాహ్మణ సంఘం జేఏసీ సభ్యులు శంకర్ శర్మ, రామశర్మ, కిరణ్ కుమార్ శర్మ, రవీంద్రరావు కులకర్ణి, చైతన్య, కిషన్ రావు, రాఘవేంద్రరావు, ప్రసాద్ శర్మ, రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు నిర్మాణంలో తీవ్ర నాణ్యతా లోపం



నవతెలంగాణ-కంది, సంగారెడ్డి

బాంబే నేషనల్ హైవే రోడ్డు వెడల్పు నిర్మాణ పనుల్లో తీవ్ర నాణ్యత లోపం జరుగుతున్నదని.. దానిపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరపాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంది కింగ్స్ దాబా వద్ద నిర్మించిన కల్వర్టును మంగళవారం పరిశీలించగా కూలిపోయి పెద్ద రంధ్రం పడిందని.. ఇదే పరిస్థితి చాలా చోట్ల ఉన్నదన్నారు. లింగంపల్లి నుంచి సంగారెడ్డి వరకు ఆరు లైన్లో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని.. వాటిలో నాణ్యత లేకుండా ఉందన్నారు. అనేక చోట్ల రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో అప్పుడే కల్వ ర్టులు కూలిపోతున్నాయన్నారు. నేషనల్ హైవే పనుల్లోనే ఇంత నిర్లక్ష్యం ఉంటే ఎట్లా అని ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరపాలని.. నాణ్యత పాటించని కాంట్రాక్టర్ల పై నేషనల్ హైవే ఇంజనీ ర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు నాయకులు నరసింహులు ఉన్నారు.

తూప్రాన్‌లో భారీ స్థాయిలో కార్డన్ సెర్చ్

- 92 బైకులు, 5 ఆటోలు సీజ్
- డీఎస్పీ వెంకటరెడ్డి







నవతెలంగాణ-తూప్రాన్


తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో డిఎస్పి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. అందులో భాగంగానే తూప్రాన్ సిఐ రంగకృష్ణ, స్థానిక ఎస్సై జి.శివానందంతో పాటు 8 మంది ఎస్ఐలు, 105 మంది కానిస్టేబుళ్లతో సహా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు చేరుకొని, సరైన ధృవపత్రాలు లేని 92 బైకులు, 5 ఆటోలను సీజ్ చేశామన్నారు. ఇందులో 8 బైకులకు నంబర్ ప్లేట్లు లేవని గుర్తించారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలను రోడ్లపై నడపరాదని, ఒకవేళ ధృవపత్రాలు లేని వాహనాలు రోడ్లపై నడిపిన కారణంగా ప్రమాదాలు జరిగిన సందర్భంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డిఎస్పి వెంకటరెడ్డి హెచ్చరించారు. ఈ కార్డన్ సెర్చ్ లో సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు జి.శివానందం, సుభాష్ గౌడ్, రాజు, మధుకర్ రెడ్డి, రంజీత్ రెడ్డి, యాదగిరి, చైతన్య కుమార్ రెడ్డి, అహ్మద్, పోలీస్ కానిస్టేబుళ్లు, సిఆర్పిఎఫ్ బలగాలు తదితరులు పాల్గొన్నారు.

తపాస్ పల్లి రిజర్వాయర్ నింపి రైతులకు సాగు నీరు అందించాలి

- డ్యామ్ నింపుతున్నట్లు కాంగ్రెస్ నాయకుల అబద్ధపు ప్రచారం మానుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తి రెడ్డి డిమాండ్







నవతెలంగాణ-కొమురవెల్లి

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి రైతులకు సాగు నీరు అందించాలని సీపీఐ(ఎం) పార్టీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రిజర్వాయర్ నీటితో ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి తపాస్ పల్లి రిజర్వాయర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ రిజర్వాయర్ నీటితో కొమురవెల్లి, చేర్యాల, మద్దూర్, దూళ్మిట్ట మండలాల పరిధిలో ఉన్న 53 గ్రామాల్లో ఉన్న 133 చెరువులు కుంటలను తపాస్ పల్లి రిజర్వాయర్ నీటితో నింపి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలన్నారు. సముద్ర మట్టానికి 550 మీటర్ల ఎత్తులో ఉన్న చేర్యాల ప్రాంత రైతుల శ్రేయస్సు కొరకే దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తపాస్ పల్లి డ్యాం నిర్మించారని, ఈ ప్రాంత రైతుల సాగు, త్రాగు నీటి సమస్య తీరాలని డిమాండ్ చేశారు. డ్యాంలో నీరు లేక వెలవెలబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి డ్యాం నింపి నీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని కోరారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్న రైతు పంట నీరు లేక ఎండిపోతే రైతన్న తీవ్రంగా నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు డ్యాం నిండకముందే నీళ్లు వస్తున్నాయని అబద్ధపు ప్రచారాలు చేస్తు రైతులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. అంతా గమనిస్తున్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తక్షణమే నీటి విడుదల చేయాలని లేని పక్షంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో రైతులను ఐక్యం చేసి ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడిగా కృష్ణరెడ్డి ,దాసరి ప్రశాంత్, అత్తిని శారద, మద్దూరు మండల కార్యదర్శి షఫీ, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2

బుధవారం | 19 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-సదాశివపేట



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సదాశివ పేట పట్టణంలో బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ గడీల రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన్న, మాజీ కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, పట్లూరి నాగరాజుగౌడ్, గుండు రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు క్రమం తప్పకుండా వసూలు చేయాలి

నవతెలంగాణ-వట్‌పల్లి



గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులను వసూలు చేస్తూ గ్రామాలభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో శశి ప్రభు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితోపాటు కార్యదర్శులతో మంగళవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వారానికి 50 మంది కైనా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిలో పని దినాలను కల్పించాలన్నారు. ఎక్కడ ఏ పని చేపట్టాలో ముందుగానే నిర్ణయించు కోవాలన్నారు. అదేవిధంగా పంచాయతీలకు సర్పంచులు లేకపో వడంతో గ్రామాలకు సంబంధించిన ప్రత్యేక అధికారులతో కార్యదర్శులతో ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా నజీరుద్దీన్, ఏపీవో టెక్నికల్ అసిస్టెంట్లు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూనికలతాండా కార్యదర్శి సస్పెండ్

నవతెలంగాణ-కంది

ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేసినందుకు మండలంలోని తూనికలతాండా గ్రామ పంచాయతీ కార్యదర్శి రేఖను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సదాశివపేట మండలం వెల్టూరు పంచాయతీ కార్యదర్శిగా రేఖ పని చేసిన సమయంలో నాలుగు లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల నిర్వహణలో కూడా నిర్లక్ష్యం వహించిందన్నారు.



ప్రత్యేక తరగతులను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-వట్‌పల్లి

ప్రత్యేక తరగతుల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఎంపీడీవో శశి ప్రభ మంగళవారం పరిశీలించా రు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్నాక్స్‌ను ఉపాధ్యాయులు ఏర్పాటు చేస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం పాఠశాల కంటే ముందుగా.. అలాగే సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత మళ్లీ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పదిలో ఉత్తమ స్థానాలు సాధించేలా కృషి చేయాలన్నారు. సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్య బోధన నిర్వహించాలన్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు రంజిత్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బాలాజీనగర్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణ మహోత్సవానికి ఆలయ ధర్మకర్తలు, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి దంపతులు, మాజీ ఎంపీపీ కొలన్ రవిందర్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణం కనులు పండుగ జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురజనుల తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి పోలీస్ డిపార్ట్మెంట్ భరోసా కేంద్రం నిర్వాహకులు మహేశ్వరి, నిర్మల మంగళవారం జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సెల్ ఫోన్ల, సోషల్ మీడియా వల్ల జరిగే నేరాల గురించి తెలియజేశారు.ఆన్లైన్ గేమింగ్ , అపరిచితులతో చాటింగ్, లైంగిక వేధింపుల చట్టం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.



ముంగి రైతు వేధికలో 'రైతు నేస్తం'

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ముంగి రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. రైతులు వ్యవసాయ సాగులో నూతన పద్ధతులు పాటించాలని సూచించారు. అంతర పంటలుగా కూరగాయలు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ, ఏఈఓలు సాయిలు, సుమలత, మాధవి, రమేష్ పాటిల్ ఉన్నారు.



పదిలో శత శాతం ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-మునిపల్లి

అంతారం పాఠశాలను మునిపల్లి మండల ప్రత్యేకాధికారి రామాచారి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని.. ఆ విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. పదో తరగతి విద్యార్థుల ప్రతిభను.. వారి ప్రణాళికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాబేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మజ్లిస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-జహీరాబాద్

ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంటు సభ్యులు బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ, కార్వాన్ శాసనసభ్యుల, సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి కౌసర్ మొహియుద్దీన్ ఆదేశానుసారం మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఎంఐఎం శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ సమక్షంలో ఎంఐఎం పార్టీలో చేరినట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మహమ్మద్ అత్తర్ అహ్మద్ తెలిపారు. షేఖాపూర్ గ్రామ యువకులు ముహమ్మద్ ఇనాయత్ పటేల్, ముహమ్మద్ అలీ, సలాహ్ ఉద్దీన్ కీ అక్బర్ ఉద్దీన్ ఒవైసీ పార్టీ కండువా వేసి ఆ యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మొహియుద్దీన్ ఘోరి, సంయుక్త కార్యదర్శి ఆమెర్ బిన్, అబ్దుల్లా ధనాసిరి, అధ్యక్షులు మొహమ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు

అమీన్‌పూర్‌లో సీనియర్ ఐఏఎస్ అధికారి పర్యటన

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలో సీనియర్ ఐఏఎస్ అధికారి దాసరి హరి చందన మంగళవారం పర్యటించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఆమెకు స్వాగతం పలికారు. అమీన్‌పూర్‌లోని సర్వే నెంబర్ 993లో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి 15 ఎకరాల ల్యాండ్‌ను సేకరించేందుకువివిధ ప్రదేశాలను సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్ రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరి చందన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ లో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 15 ఎకరాలు భూమిని సర్వేనెంబర్ 993లో పరిశీలించినట్టు చెప్పారు. అనువైన భూమికి సంబంధించిన వివరాలు భూ పరిపాలన విభాగం హైదరాబాద్ వారికి పంపించాలన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి వెంట సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా ఆర్డీవో రవీందర్ రెడ్డి, స్థానిక మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్‌తో వివిధ శాఖల అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ రైతుల అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని హద్నూర్, గుంజేటి గ్రామాల్లో నిమ్జ్ భూసేకరణ అవార్డు పాస్ చేసేందుకు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. స్పెషల్ నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు హాజరై నిమ్జ్ భూ బాధితుల గ్రామస్తుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. కాగా రైతులు జైపాల్ రెడ్డి, నర్సారెడ్డి, ప్రభాకర్, పలువురు రైతులు మాట్లాడుతూ.. రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని గ్రామసభ ద్వారా డిమాండ్ చేశారు. నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం ఏమాత్రం సరిపోదన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవన ఉపాధి పొందుతున్నామని.. సాగుకు యోగ్యమైన భూములను తీసుకోవద్దన్నారు. స్పెషల్ నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు మాట్లాడుతూ.. నిమ్జ్ భూ సేకరణ ప్రక్రియ మార్చిలోపు పూర్తి చేస్తామన్నారు. రైతుల డిమాండ్లను, అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, రాజిరెడ్డి, నిమ్జ్ అధికారులు సిద్దారెడ్డి, నిమ్జ్ రైతులు గ్రామస్తులు మధు, వెంకట్, సురేందర్, విజ్జప్ప తదితరులున్నారు.

బాల్యవివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలి

నవతెలంగాణ-జహీరాబాద్



బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఐసీడీఎస్ డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ లలితా కుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన బాల్యవివాహాల నిర్మూలన అవగాహనా శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ప్రథమ కర్తవ్యంగా విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్యవివాహాల చట్టాన్ని కట్టుదిట్టంగా అమలుపరిచేందుకు కృషి చేస్తున్నదన్నారు. ఎవరైనా బాల్యవివాహాలకు ప్రోత్సహిస్తే వారందరికీ కఠిన శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహంలో భోజనం చేసిన వారికి కూడా శిక్ష పడుతుందన్నారు. గ్రామాల్లో ఉన్న కమిటీలన్నింటిలో కూడా బాల్యవివాహాల నిరోధక చట్టాన్ని గురించి అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ఎక్కడైనా గుట్టు చప్పుడు కాకుండా బాల్యవివాహాలను జరుపుతున్నట్లు తెలిస్తే మండల స్థాయిలో తహసీల్దారులకు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలకు, జిల్లా స్థాయిలో కలెక్టర్లకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలతో జరిపే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అప్పటికీ వినకపోతే పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలియపరచి చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసిపిఎస్ రతన్ం, సీడీపీఓ అంజమ్మ, సూపర్వైజర్లు అనిత, నీరజ, సద్గుణ, రాధమ్మ, తుల్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటా



నవతెలంగాణ-జహీరాబాద్

అభిమానులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తానని జెకె చారిటబుల్ ట్రస్ట్ చైర్మె న్, బీఆర్ఎస్ నాయకులు దేశెట్టి పార్టీలు అన్నారు. జహీరాబాద్ పట్టణ పరిధిలోని రచన్నపేట్ వార్డుకు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకులు అక్షయ్ దేశ్పాండే జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. దేశెట్టి పాటిల్ వ్యక్తిగత కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో పూల మాల, శాలువకప్పి ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ జంగమ సమాజ్ నాయకులు చంద్రశేఖర్, న్యాల్కల్ మండల తాజా మాజీ జెడ్పీటీసీ బొడ భాస్కర్, కోహిర్ మండల మాజీ జడ్పిటిసి, బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింలు యాదవ్, మ్యాతరి ఆనంద్, చంద్రశేఖర్ స్వామి, వేణుగోపాల్ రెడ్డి, మహిపల్ రెడ్డి రాంజోల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని బాలాజీ నగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్త ప్రజానీకం సుఖ:సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానిం చారు. కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పెంటారెడ్డి, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, చక్రపాణి, జయ్, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-సంగారెడ్డి

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సంగారెడ్డి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు లకుడారం మాణిక్ ప్రభు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ రోడ్డులో గల శ్రీ గణేష్ హెయిర్ స్టైల్ షాపులో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి, పేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు సేవ చేసే విషయంలో కలిసొచ్చే ప్రతి ఒక్కరితో కలిసి ముందుకు పోతామన్నారు. ఈ కార్యక్ర మంలో పట్టణ గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసి డెంట్ సాయినాథ్, ప్రధాన కార్య దర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి రజోల్ ప్రభు, కార్యదర్శి మురారి, కోశా ధికారులు శేఖర్, స్వాగత్ ప్రభు, పెంటయ్య, నాయకులు చర ణ్, రాము, దుర్గేష్,అశోక్,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు డప్పుల వితరణ

నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని పలువురు కళాకారులకు మాజీ ఉప సర్పంచ్ పలుగు గోవర్ధన్ రెడ్డిని డప్పులు వితరణ చేశారు. తమకు డప్పులు ఇప్పించాలని కానుకుంట గ్రామా నికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేయగా.. ఆయన వెంటనే స్పందించి 24 కళాకారులకు డప్పులు ఇప్పించారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. తనవ ంతు సహా యం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై దాడి కేసు నిందితుల రిమాండ్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ
- కులమతాలను రెచ్చగొడితే చర్యలు తప్పవని హెచ్చరిక

నవతెలంగాణ-మునిపల్లి



మండలంలోని అంతారం గ్రామంలో తండ్రి పై దాడి చేస్తుండగా అడ్డుపడేందుకు వెళ్లి దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన బాలిక విషయంలో నిందితుల్ని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్టు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపారు. మునిపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అంతారం గ్రామానికి చెందిన ఇస్మాయిల్ మరియు కొల్లూరు వీరారెడ్డి ఇల్లు పక్క పక్కన ఉన్నాయి. వీరారెడ్డి కి చెందిన ఇంటివయందు ప్రహరీ గోడ లేని ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంలో ఈనెల 11వ తేదీన రాత్రి ఇస్మాయిల్ మలవిసర్జన చేశాడు. అయితే వద్దు అని పలుమార్లు చెప్పినప్పటికీ పదేపదే ఎందుకు అక్కడ టాయిలెట్ పోస్తున్నావని వీరారెడ్డి అతని చిన్నాయిన విజయ రెడ్డిలు ఇస్మాయిల్‌ను ప్రశ్నించారు. వారి మధ్య మాటామటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఇస్మాయిల్ పై వీరారెడ్డి, విజయ్ రెడ్డిలు దాడికి పాల్పడుతుండగా తండ్రిని కాపాడేందుకు ఇస్మాయిల్ కూతురు అలియా బేగం అడ్డుగా వచ్చింది. దాంతో వారు ఆలియా బేగం పై కూడా రాళ్లతో మట్టిపెడ్డలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. అంతలోనే గ్రామస్తులు వచ్చి ఘర్షణ వాతావరణాన్ని తొలగించి బాలికను ప్రథమ చికిత్స నిమిత్తం తరలించి తర్వాత సదాశివపేటకు, ఆ తర్వాత సంగారెడ్డికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. సంగారెడ్డి లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఈనెల 16వ తేదీన ఉదయం ఆసుపత్రిలో మృతి చెందింది. ఈ మేరకు బాలిక అలియా బేగం మృతికి కారకులైన వీరారెడ్డి, అతని చిన్నాన్న విజయ్ రెడ్డి లను అరెస్టు చేసి కోర్టు ముందుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వలయాధికారి వెంకటేష్, ఎస్సై రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే సహించేది లేదు.

అంతారం గ్రామంలో అనుకోకుండా జరిగిన సంఘటనను రెండు మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా పలువురు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారన్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇతర సామాజిక మాధ్యమాల్లో కుల మతాలను రెచ్చగొట్టే విధంగా, ఇరు వర్గాల మధ్య చిచ్చుపెట్టే విధంగా పలువురు పోస్టులు పెడుతున్నారని ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డిఎస్పి హెచ్చరించారు.

ఆరు నెలలుగా మంచి నీళ్లు బంద్

- ఖమ్మంపల్లిలో తాగునీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు
- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

నవతెలంగాణ-మునిపల్లి



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో వేసవి కాలం రాకముందే తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. గత అరునెలల నుంచి గ్రామంలోని దళిత వాడ ప్రజలు తాగునీటి సమస్యతో నానాఅవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ఈ విషయాన్ని ప్రస్తావించినా.. నేటికీ ఎవ్వరు స్పందించలేదని మండిపడ్డారు.

దళితవాడ మిసన్ భగీరథ పైప్‌లైన్ కట్

ఖమ్మంపల్లి దళితవాడకు వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను కావాలనే కట్ చేశారని.. పంచాయతీ కార్యదర్శి తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంపల్లిలో ఏర్పడ్డ తాగు నీటి సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే కలెక్టర్ చొరవ తీసుకుని.. గ్రామంలో ఏర్పడ్డ తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మత సామరస్యానికి శివాజీ ప్రతీక



నవతెలంగాణ-సంగారెడ్డి

శివాజీ మత సామరస్యానికి ప్రతీక అని.. శివాజీకి సంఘ్ పరివార్ శక్తులు మతంరంగు రుద్దడం సరికాదు అని సీపీఐ సంగారెడ్డి జిల్లా సమితి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సీపీఐ సంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జలాలుద్దీన్ మాట్లాడుతూ.. మొఘల్ రాజవంశాన్ని వ్యతిరేకించి 17వ శతాబ్దపు భారత దేశంలో మరాఠా రాజ్యాన్ని స్థాపించిన వ్యక్తి శివాజీ అని అన్నారు. శివాజీ, ప్రజాదరణ పొందిన చక్రవర్తి అని అన్నారు. ఆయన చరిత్రను వక్రీకరించి కేవలం హిందువులకే ప్రతినిధిగా చూపించే ప్రయత్నం చేస్తున్న మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు లౌకిక ప్రజాతంత్ర శక్తులు మేధావులు ప్రజల్లోకి చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్ ఖాన్, రెహమాన్, రుబీనా బేగం, నాయకులు కాశీనాథ్, నర్సింహులు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కమిషనర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టాక్స్ కలెక్షన్ బృందాలు మున్సిపాల్టీ పరిధిలో పరిశ్రమల యజమానుల నుండి మరియు గృహ యజమానుల నుండి ఆస్తి పన్నులు వసూలు చేశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా అగ్రోటెక్స్ కోటింగ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ యజమాని బీవి రాజు రూ.1,47,751లు, సంభీమ్ స్పెషాలిటీ యజమాని వై శ్రీధర్ రూ.2,15,300లు ఆస్తి పన్నులు చెక్కుల రూపంలో మున్సిపల్ కమిషనర్‌కి అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆస్తి పన్నులు చెల్లిస్తున్నందున కమిషనర్ సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఇంకనూ మిగిలి ఉన్న పరిశ్రమలు, గృహ యజమానులు ఆస్తి పన్నులు మొత్తం సకాలంలో చెల్లించి మున్సిపాల్టీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున స్వామి, రెవెన్యూ ఆఫీసర్ టీ నర్సింహులు, వార్డ్ ఆఫీసర్లు ,బిల్ కలెక్టర్లు రెవెన్యూ టాక్స్ కలెక్షన్ టీం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
3
బుధవారం | 19 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీకి స్థలం సేకరించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-పాపన్నపేట

మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీకి స్థల సేకరణ చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్ ఆర్డీవో రమాదేవితో కలిసి మంగళవారం పాపన్నపేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 10 నుంచి 15 ఎకరాల భూమిని గుర్తించేందుకు పాపన్నపేట మండలంలో తమ్మాయిపల్లి గ్రామంలోని భూమిని పరిశీలించారు. భూ పరిపాలన విభాగానికి ప్రతి పాదనలు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డిఓ రమాదేవి, ఇన్చార్జి డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ గౌడ్ సంబంధిత రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ ఎన్‌పిఏని 0.5శాతంకు తగ్గించాలి

- డీఆర్‌డీఓ శ్రీనివాసరావు



నవతెలంగాణ-వెల్దుర్తి

బ్యాంకు లింకేజీ ఎన్‌పిఏని 0.5% తగ్గించి బ్యాంకు లింకేజీ టార్గెట్ అచీవ్మెంట్ 130% చేయాలని డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీనిధి టార్గెట్ అచీవ్మెంట్ 130% చేయాలని, శ్రీనిధి ఎన్‌పిఏ 0.5% కు తగ్గించాలని సూచించారు. ఈ సమావేశంలో భాగంగా ఏపిఎం శంకరయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఆర్ఎం గంగారం ఏపీఎం శంకరయ్య సీసీలు సత్యం యాదగిరి కిషన్ రజిత శ్రీనిధి ఏఎం కరుణాకర్ వివోఏలు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది



నవతెలంగాణ-మెదక్

పదోన్నతి బాధ్యతను పెంచుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా కామారెడ్డి , సిద్దిపేట జిల్లాలకు కేటాయించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ రెవిన్యూ ఉద్యోగులను ఉద్దేశించి పలు సూచన చేస్తూ పదోన్నతి బాధ్యతను పెంచుతుందని వృత్తినే దైవంగా భావించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ పదోన్నతి పొందిన ఉద్యోగులు ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-పాపన్నపేట

ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంకు చెందిన సంజీవ్ కుమార్ (25) ఉపాధి నిమిత్తం రాష్ట్రానికి వచ్చి మొదటగా కామారెడ్డి జిల్లాలో గప్‌చుప్ బండిని నిర్వహించేవాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న శ్రీలత అనే అమ్మాయితో పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి వివాహం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో గప్‌చుప్ బండిని నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసగా మారాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో భార్య కామారెడ్డి జిల్లాలోని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ క్రమంలో మద్యానికి బానిసై మనస్తాపం చెంది సోమవారం రాత్రి సమయంలో అద్దె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెదక్ బోధన్ రోడ్డు విస్తరణ పనులు జాప్యం

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న మండల, గ్రామాల ప్రజలు



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

మెదక్-బోధన్ రోడ్డు విస్తరణ పనుల్లోనూ జాప్యం జరగడంతో గత కొన్ని నెలలుగా మండల, ఆయా గ్రామాల ప్రజలు మెదక్-బోధన్ ప్రధాన రహదారిపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ నుండి బోధన్ వరకు వెళ్లే నేషనల్ 765 డి పనులు నెలల కొద్ది జరుగుతున్నా ముందుకు సాగకపోవడంతో రోజు వందలాది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద డ్రైనేజీ కోసం తీసిన కాలువ ప్రమాదకరంగా మారింది. మెదక్ నుంచి బోధన్, బూర్గుపల్లి ఆయా గ్రామాలకు వెళ్లే బస్సులు అక్కడే ఆగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ నుంచి హవేలీఘనపూర్ వచ్చే దారిలో ఇరువైపులా దుకాణాల సముదాయాలకు వెళ్లే దారి కంకర వదిలివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హవేలీఘనపూర్ పోలీసు స్టేషన్ ఎదురుగా, తొగిట కమాన్ వద్ద డ్రైనేజీ పనులు వదిలి వేయడంతో ప్రమాదాలకు చోటు చేసుకుంటుంది. మెదక్ బోధన్ ప్రధాన పనుల జాప్యంలో నేషనల్ హైవే అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.


రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నవతెలంగాణ-మెదక్ : హెల్మెట్ మన ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని ప్రజలకు, కలెక్టరేట్ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాల య ప్రధాన గేట్ వద్ద కార్యాలయంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను, హెల్మెట్ ధరించకుండా వచ్చిన వారికి డిఆర్ఓ భుజంగరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రయాణం ఎంత ముఖ్యమో గమ్యస్థానం చేరడం కూడా అంతే ముఖ్యమని బైక్‌పై ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణించవద్దన్నారు. మనకోసం మన కుటుంబం ఆధారపడి ఉందని మన ప్రాణానికి నష్టం జరిగితే కుటుంబం పెద్దదిక్కుని కోల్పోతుందని గుర్తుంచుకోవాలన్నారు ప్రతి ఒక్కరూ బైక్‌కు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను ప్రజలలో చైతన్యం కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు .

నిండిన చెరువులు.. ఎండిన కాసిం పూర్ చెరువు

- కొండపోచమ్మ నీరు కొన్ని చెరువులకేనా ?
- అన్ని చెరువులకు అందేటట్లు అధికారులు నీటిని విడుదల చేయాలి







నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర రైతులకు సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండడం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి మల్లన్న సాగర్, కొండపోచమ్మ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపాలనే ఉద్దేశంతో కట్టించడం జరిగింది. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలోని దామరచెరువు, బోల్లికుంట, చౌకత్ పల్లి కుంటలు మాత్రమే నిండుతున్నాయి. మిగతా గ్రామాలలోని చెరువులు మాత్రం ఎండుతున్నాయి. మండలంలోని అన్ని చెరువులు నిండాలంటే కాలువ నిండా నీటిని విడుదల చేయాలని, అధికారుల నిర్లక్ష్యం వల్లనే నీరు రావడంలేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన నీరును కూడా దౌల్తాబాద్, బోనాల, రైతులు కాల్వ నీరు రాకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. కాల్వనిండా నీటిని విడుదల చేసినట్లయితే అన్ని చెరువులు నిండుతాయని రైతులందరూ సంతోషపడతారని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మండలంలోని చెరువులు అన్ని నిండే విధంగా నీటిని ఎక్కువగా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

మా చెరువులను కూడా నింపాలి



మా గ్రామంలోని కుంటలు వర్షాకాలంలో నిండుతున్నాయి. రెండు నెలలు కాగానే ఎండుతున్నాయి యాసంగి పంటలు పండాలంటే కాలువల ద్వారా వచ్చే నీటితో కుంటలను నింపినట్లైతే పంటలు పండుతాయి. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మల్లన్న సాగర్ కాల్వ నుంచి నీరు వస్తాది అని చెప్పిన్నారు. ఇప్పటివరకు రాలేదు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రజాక్ పల్లి, కాసింపూర్ చెరువులను నింపే విధంగా తగు చర్యలు చేపట్టాలి.

జీడి నారా గౌడ్, కాసిం పూర్ వాసి

అవాంఛనీయ ఘటనలు లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికలు

- పోలీస్ స్టేషన్ రికార్డులు పరిశీలించిన జిల్లా ఎస్పీ
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-శివ్వంపేట

జిల్లాలో త్వరలో జరగబోయే శాసనమండలి ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ నిర్వహించే శివ్వంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ గదుల వద్దకు ఓటర్లు వెళ్ళడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అనుమతులు లేకుండా ఎవరిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించొద్దని ఆయన సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఎవరిని గుమిగూడనియ్యవద్దని ఆదేశించారు. అనంతరం శివ్వంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నేరాల వివరాలు అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ మధుకర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేకు సహకరించాలి

- ఏఓ లావణ్య



నవతెలంగాణ-శివ్వంపేట

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సూచనలతో మండలంలో చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వేకు రైతులంతా సహకరించాలని మండల వ్యవసాయాధికారిణి లావణ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారులతో కలిసి మంగళవారం డిజిటల్ క్రాప్ సర్వేను చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశానుసారం మండలంలో 7 వేల 6వందల ఎకరాల పంటలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు మండలంలో 2 వేల ఎకరాలలో సాగు చేసిన పంటలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా ఆన్ లైన్‌లో నమోదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం నిధి డిపాజిట్ పథకంలో చేరండి



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

రైతులందరూ నిధి డిపాజిట్ పథకంలో చేరాలని బీసీసీబీ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జంగారాయి సహకార పరపతి సంఘం కార్యాలయంలో రైతులతో రైతు నేస్తం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్‌లో రైతు నేస్తం నిధి పథకంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. సహకార నిధి డిపాజిట్ పథకంలో చేరండి కేవలం 8 సంవత్సరాల 9 నెలల లోపే డిపాజిట్ మొత్తాన్ని రెట్టింపు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం జనవరి 26 నుండి ఫిబ్రవరి 25 వరకు ఈ స్కీం వర్తిస్తుందని తెలిపారు. బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే అన్ని రకాల రుణాలను పొందవచ్చని తెలిపారు. వ్యవసాయతర రుణాలు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో గృహ నిర్మాణాలకు వాహన రుణాలు స్వదేశీ మరియు విదేశీ విద్యార్థులు మహిళా సంఘాలు రుణాలను పొందవచ్చని తెలియజేశారు. అన్ని బ్రాంచీలలో లాకరు సదుపాయం ఉన్నదన్నారు. గ్రామీణ సౌభాగ్యమే మా స్వప్నమని తెలిపారు. బంగారంపై అత్యధికంగా రుణ సదుపాయం తక్షణమే పొందవచ్చని తెలిపారు. ఫోన్ పే గూగుల్ పే సౌకర్యం కలదన్నారు. జిల్లా సహకార బ్యాంకులో క్రాప్ లోన్‌తో పాటు పట్టా భూమి కలిగిన ప్రతి ఒక్కరికి బోర్ వెల్స్, కోళ్ల ఫారాలకు రుణ సదుపాయం అందిస్తుందని తెలిపారు. అన్ని బ్యాంకుల కంటే తమ బ్యాంకులో డిపాజిట్లపై 7.9 శాతం వడ్డీ రేటు చెల్లిస్తుందని తెలియజేశారు. డిసిసిబి ఫీల్డ్ ఆఫీసర్ సంగమేశ్వర్, బాలకృష్ణయ్య, కంప్యూటర్ ఆపరేటర్ శేఖర్ గౌడ్, కుమార్ రైతులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-శివ్వంపేట

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాద్ గాంధీ భవన్‌లో మంగళవారం మండలం గూడూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనం గా సన్మానించారు. గ్రామకమిటీ అధ్యక్షులు ఉషగోని శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌ను కలిసి పార్టీ సంస్థాగత సమస్యలపై వినతులను అందజే శారు. ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతినిత్యం కష్టపడుతున్న నాయకుల కే త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ల ఎన్నికలలో పోటీ చేసే అవకాశా లను కల్పించాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామకమిటీ అధ్యక్షులు ఉశగోనిశంకర్ గౌడ్, నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నర్సింహాయాదవ్, పాల్గొన్నారు.

ప్రజలకు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



నవతెలంగాణ-మెదక్

వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, మారుమూల ప్రాంతాలకు నీటిని అందించే దుకు అధికారులు సమన్వయంతో కార్యాచరణ రూపొందిం చాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు వివిధ శాఖల అధికారులతో సాగునీరు, త్రాగు నీరు, విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్‌కు సాగునీటి సరఫరా, సంబంధిత విషయాలపై సుదీర్ఘంగా చర్చిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో విద్యుత్ వినియో గంపై అధికారు లతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సూచించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ అంతరాయం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సెక్టోరల్ అధికారి



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా సెక్టోరియల్ అధికారి జ్యోతి మంగళవారం సందర్శించారు. హెచ్ డబ్ల్యు ఓ జయరాజు ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారి జ్యోతి మాట్లాడుతూ ఆపార్ ఐడీలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. సందేహాలు ఏమైనా ఉంటే ఎమ్మార్సీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గయ్య , నరేందర్, మంజుల రాజేశ్వరి, సత్య గౌడ్, వినోద గేమ్ సింగ్ పిఈటి పానిల్ కుమార్, ఏఎన్ఎం వెన్నెల, సిఆర్‌పి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



నవతెలంగాణ-నర్సాపూర్

ప్రజల నుంచి వచ్చే ఫిర్యా దులపై పోలీసులు తక్షణమే స్పందిం చాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించా రు. మంగళవారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర ప్రవృత్తి గల వారిని ప్రతిరోజు తనిఖీ చేయాలని ఆదేశించారు. నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేకమైన నిఘా ఉంచాలని సూచించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిదప పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యా దుదారులతో మర్యా దపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. తూప్రాన్ సీఐ రంగకృష్ణ, నర్సాపూర్ ఎస్ఐ లింగం కృష్ణ, శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో సీసీ ఫ్లోరింగ్ పనులు చేపట్టిన "రెడ్డి ద్వయం"



నవతెలంగాణ-నార్సింగి

పట్టణ కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో సీసీ ఫ్లోరింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రాచీనమైన ఈ దేవాలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ సరిగ్గా లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆలయ కమిటీ యెన్నం రాజేందర్ రెడ్డి, బక్కన్నగారి సంపత్ రెడ్డిలకు తెలిపారు. వెంటనే స్పందించిన "రెడ్డి ద్వయం" సీసీ ఫ్లోరింగ్ 1500 స్క్వేర్ ఫీట్ అంచనా వ్యయం సుమారు రూ.1.60లను ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ వారికి మాట ఇచ్చారు. వెంటనే పనులను ప్రారంభించి త్వరితిగతిన పూర్తి అయ్యేట్లు చేసారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు బోడికే పోచయ్య మాట్లాడుతూ వేణుగోపాల స్వామి ఆశీస్సులు వారికి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే పనులను ప్రారంభించామని, ఆ వేణుగోపాల స్వామి దీవెనలు తమ మీద, సకల జనుల మీద పుష్కలంగా ఉండాలని కోరుతున్నామని రాజేందర్ రెడ్డి, సంపత్ రెడ్డి అన్నారు. స్వంత డబ్బులతో ఫ్లోరింగ్ పనులు జరుపుతున్న "రెడ్డి ద్వయం"లకు ఆలయ భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

20 నుంచి 25 వరకు ఈ బాహాసే ఇండియా పోటీలు

- పాల్గొనున్న 85 కళాశాలల విద్యార్థులు
- ప్రిన్సిపాల్ సంజయ్ దూబే



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఈ బాహాసే ఇండియా పోటీలు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దుబే తెలిపారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సౌత్ ఇండియాలోనే రెండవసారి ఈ పోటీలను బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు దేశంలోని 85 కళాశాలలో నుంచి విద్యార్థులు హాజరై ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు కళాశాల ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దశరథ్, డాక్టర్ కే రాయుడు, డాక్టర్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

పూరి జగన్నాథుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ వైయస్సార్ కాలనీలోని పూరి జగన్నాథ్ ఆలయంలో మహా యజ్ఞోత్సవం-పార్శ్వ మందిరాల ప్రతిష్ఠోత్సవాలు అత్యంత వైభవంగా కొన సాగుతున్నాయి. మంగళవారం జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తో కలిసి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి జగన్నాథుడిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తుల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషనీయమన్నారు. ఈ సందర్భంగా నాయకులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక భక్తులే కాకుండా నగరానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూరి జగన్నాథుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చక్రపాణి, లక్ష్మన్, ధర్మేందేర్ యాదవ్, ఉమాకాంత్, సునీల్ సింగ్, తివారీ, బసంత్రెర, జితేందేర్ యాదవ్, సునీల్ సింగ్, అశ్వక్ యాదవ్, పద్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహా పూజలు



నవతెలంగాణ-శివ్వంపేట

తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా నిర్మితమైన, అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో బగలాముఖీ అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం ఉదయం అమ్మవారికి మహాపూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి మహాపూజలతో పాటు రుద్ర యామల బగలా అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపుతో అర్చన (హరిద్రార్చన) నిర్వహించడమే కాకుండా అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి, వివిధ రకాలఫలాలతో నైవేద్యం సమర్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు హాజరైన భక్తులకు ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసా దాలను, అమ్మవారి భక్తులు కొడకంచి అశోక్ గౌడ్ దంప తులు పులిహోర ప్రసాదం అందజేశారు. ఈ కార్య క్రమంలో బగలాముఖీ ట్రస్ట్ సభ్యులు శాస్త్రుల పురుషోత్తం శర్మ, ట్రస్ట్ అధికార సభ్యులు సూర్యకుమార్ గౌడ్, అమ్మవారి భక్తులు మహేందర్ రెడ్డి, ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, పత్రాల రాజుగౌడ్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు కాముని నగేష్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, రాజీపేట కిషన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డప్పూర్ దర్గాను దర్శించుకున్న దేశెట్టి బృందం .



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని డప్పూర్ గ్రామంలో గల హజ్రత్ పిర్ గైబ్ సాహెబ్ 185వ ఉర్సు ఉత్సవాలకు జేకే చారిటేబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మెన్, బీఆర్ఎస్ అసెంబ్లీ నాయకులు బొమ్మ దేశెట్టి పాటిల్, బీఆర్ఎస్ యువ నాయకులు లోకేష్ పాటిల్‌తో కలిసి హాజరయ్యారు. పిర్ గైబ్ సాహెబ్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ గుంజేటి, మాజీ ఎంపిటిసి దేశెట్టి పాటిల్‌ని పూలమాల శాలువకప్పి ఘనంగా సన్మాని ంచారు. దేశెట్టి పాటిల్ మాట్లాడుతూ.. ఉర్సులతో పరమత సహనం పెరుగుతు ందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు డప్పూర్ రవీందర్, భక్తులు స్థానికులు రవి కుమార్ , శివరాజ్ , లోకేష్ పాటిల్, విజయ్ రాథోడ్, సూర్య తేజ, రవికాంత్, బంటు వెంకట్ తదితరులు పాల్గొన్నారు..

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన పంబల్ల గంగమ్మ ఇటీవల మరణించారు. విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు తెలుపగా ఆయన స్పందించి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ ద్వారా నగదును ఆర్థిక సాయంగా పంపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుల సమక్షంలో గోవర్ధన్ మృతురాలి కుటుంబ సభ్యులకు ఆ సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సందిగారి నర్సింహులు గౌడ్, శ్రీరామ్ భరత్, యూత్ నాయకులు బాలకృష్ణ గౌడ్, కందరి బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్స వేడుకలు



నవతెలంగాణ-సదాశివపేట

పట్టణంలోని బంగారు మైసమ్మ ఆలయం 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం ఆలయ ప్రధాన పూజారి ఆధ్వర్యంలో ఉదయం నుండి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, చండీ హెూమం,ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు కలశాల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యను పరిష్కరించాలి



- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

విద్యారంగ సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ 17వ మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపైన రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పట్టింపు లేదని తెలిపారు. రోజురోజుకి స్కాలర్షిప్లు పెరుగుతున్నాయి తప్ప రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తలేదని తెలియజేశారు. గత ఆరు ఏండ్లుగా రూ.8300 కోట్లు స్కాలర్షిప్ ఈజ్ రెమైన్స్మెంట్ రావాల్సి ఉందని తెలిపారు. విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. రోజురోజుకు విద్య రంగ సమస్యలు పెరుగుతున్నాయి తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఉన్న బాయ్స్ హబ్ నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గత ఏడాది నుంచి హాస్టల్లో సరిగ్గా నీళ్ల రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ కార్యదర్శి కోనేరు ప్రవీణ్, డివిజన్ కమిటీ సభ్యులు హరికృష్ణ, వంశీ, అరుణ్, లోకేష్, బన్నీ, రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మెన్

నవతెలంగాణ-కొండపాక



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి మంగళవారం హైదరాబాదులో కలిశారు. సహకార సంఘాల కాల పరిమితి ఆరు నెలలు పొడిగించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి జానారెడ్డిని కలిశారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే టైక్వాండో కరాటే

- పోటీల్లో సత్తచాటిన సిద్దిపేట్ క్రీడాకారులు

నవతెలంగాణ-మర్కుక్



హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియం లో ఇటీవల నిర్వహించిన 8వ రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలో సిద్దిపేట జిల్లా క్రీడాకారు లు పథకాలను చేజింకిం చుకున్నారు. ఇందులో ఒకటి గోల్డ్ మెడల్, ఒకటి సిల్వర్ మెడల్, ఎనిమిది బ్రోంజ్ మెడల్ పథకాలు సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్ రెడ్డి, మాస్టర్ స్వామి తెలియజేశారు. గోల్డ్ మెడల్ సాధించిన తోట శాన్వి, సిల్వర్ మెడల్ సాధించిన తోట శ్రీ హర్ష, బ్రోంజ్ మెడల్ సాధించిన ద్యుతి రెడ్డి, యువన్ రెడ్డి, హనియా, తన్వి హేమచంద్ర పథకాలను సాధించారు. క్రీడాకారులందరికి సిద్దిపేట జిల్లా అసోసియేషన్ తరపున వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామపంచాయతీ కార్మికుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-అక్కన్నపేట



మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు తాడూరి నర్సయ్య ఇటీవల మరణించారు. భైరగోని ప్రశాంత్, పాంద్రాల మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం వారి కుటుంబానికి గ్రామస్తుల సహకా రంతో రూ.7,700లు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి ఎంతో సేవ చేసినారు. ఆయన చేసిన సేవను గుర్తించి గ్రామంలోని కొంతమంది వ్యక్తులు తలా ఇంత సాయం అందించారు. ఇట్టి సొమ్మును వారి కుటుంబానికి అందజేశామన్నారు. అనంతరం బాధిత కుటుంబీకులు మాట్లాడుతూ.. మా పరిస్థితిని అర్థం చేసుకొని, సాయం చేసిన మీ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొమ్ముల పర్శయ్య, పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కొండపాక



కుకునూరుపల్లి మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన దున్నపోతుల ఉప్పలవ్వ మంగళవారం అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న కోనాయిపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.6 వేలు నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయన వెంట పోచయ్య రాజు తదితరులు ఉన్నారు.

ప్రసన్న హరికృష్ణను గెలిపించండి

నవతెలంగాణ-సిద్దిపేట




పదవుల కోసం కాదు, సమస్యల పరిష్కారం అన్న నినాదంతో ముందుకు వస్తున్న విద్యావేత్త, సామాజిక ఉద్యమ కారుడు, తన 19 ఏండ్ల ఉద్యోగానికి రాజీనామా చేసి, నిరుద్యోగుల, ఉద్యోగుల అండగా ఉండటానికి ముందుకు వచ్చిన ప్రసన్న హరికృష్ణను గెలిపించి శాసనమండలికి పంపాలని నిరుద్యోగ హక్కుల నేత, అశోక అకాడమీ డైరెక్టర్ అశోక్ కుమార్ ఓటర్లను కోరారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు, ఉద్యోగులు పట్టభద్రులు బీఎస్పీ బలపరిచిన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 3వ నెంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వము నిరుద్యోగులకు తీవ్రమైనటువంటి అన్యాయం చేస్తున్నాయని, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పేసి కేవలం 12వేల ఉద్యోగాలే ఇప్పటివరకు నింపడం జరిగిందని, ఉద్యోగులకు సంబంధించి 317 జీవో తీసుకొచ్చి ఇబ్బందుల గురి చేశారని, ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వలేని పరిస్థితులలో ఇవాళ్ళ రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఓయూ విద్యార్థి గౌస్ మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నేత సుకేశ్, జగదీశ్, ప్రణీత్, రంజీత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం బాగుంది

- పంచాయతీరాజ్ ఏఈ బిక్షపతి.

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం మల్చెరు తండాలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యత లేకుండా నిర్మించారని మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఆరోపణ చేస్తూ ఏఈకి వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన ఏఈ బిక్షపతి మంగళవారం మల్చేరుతండా గ్రామానికి వెళ్లి సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణం చాలా బాగుందని, శ్రీనివాస్ అనే వ్యక్తి పాత సీసీ రోడ్డును చూసి పగిలిపోయిందని ఆరోపణ చేశారన్నారు. రోడ్డు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని తెలియజేశారు. గ్రామస్తులు కూడా రోడ్డు ఎలాంటి పగుళ్లు, రాలేదని చెప్పినట్లు ఏఈ తెలిపారు. అనంతరం కాంట్రాక్టర్ బైకాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించి సీసీ రోడ్డు నిర్మించానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి అభివృద్ధిని ఓర్వలేక ఇలా ఆరోపణ చేసి పాత సీసీ రోడ్డు ఫోటోలను చూపిస్తూ, అధికారులను, విలేకరులను, గ్రామస్తులను తప్పుదోవ పట్టించారన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆరోపించారు.

ఉచిత పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- మండల పశువైద్యాధికారి డాక్టర్ సయ్యద్

నవతెలంగాణ-రాయపోల్



పశు సంపద అభివృద్ధి కోసం ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయపోల్ మండల పశువైద్యాధికారి డాక్టర్ సయ్యద్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం వీరానగర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక శాఖ వారు సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా పశు గణాభివృద్ధి చేయడం కోసం పశువుల ఆరోగ్యంగా ఉండటం కోసం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 18-పశువులకు గర్భధారణ పరీక్షలు, 2-పశువులకు గర్భధారణ టీకాలు, 2-పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 16-పశువులకు సాధారణ చికిత్సలు, 26-దూడలకు నటల నివారణ మందులు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ షకీల్, ఓఎస్ బాలకృష్ణ, ఓఎస్ నరేష్, గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్ గౌడ్, గోపాలమిత్రలు ఫయాజ్ వాజిద్, హర్షద్, పాడి రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

28లోపు కుల గణన సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేసుకొని వారు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్, ఒక ప్రకటనలో కోరారు. సర్వే చేయించుకునే వారు అప్లికేషన్ ఆన్లైన్లో డౌన్లోడ్ చేసుకుని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన కేంద్రంలో ఇవ్వాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన కౌంటర్ వద్దకు వచ్చి దరఖాస్తూ ఫామ్ తీసుకుని ఫామ్ నింపి ఇవ్వాలని ఆయన తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కుటుంబ వివరాలు ఇచ్చినచో సంబంధిత ఎన్యూమరేటర్ వారి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటారని ఆయన తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 040 21111111 ఈ కాల్ ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు



- ఇబ్బందికరంగా మారిన బేగంపేట రోడ్డు
- రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికుల నిరసన

నవతెలంగాణ-బెజ్జంకి

బీటీ రోడ్డు నిర్మాణానికి కంకర వేసి దాదాపు ఏడాది కావస్తున్నా నేటికీ బీటీ నిర్మాణం చేపట్టకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపో యాయి. నిర్మాణం పూర్తయిన వరకు నిధులు విడు దల కాకపోవడం, ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరి వల్ల పనులు నిలిచిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి గూడెం-బేగంపేట గ్రామం వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరీ చేసి సగం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. మండల కేంద్రం నుంచి గూడెం, బేగంపేట వడ్లూర్, గన్నేరువరం మండల కేంద్రానికి వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అసంపూ ర్తిగా నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధిత కాంట్రాక్టర్ కంకర పోసి ఏడాదికాలమవుతుంది. మార్గమధ్యలో రోడ్డు నిర్మాణ పనులు వదిలేయడంతో నిత్యం మండల కేంద్రానికి వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తిచేసే విషయంలో అధికారులేవరూ చొరవ చూపడం లేదని. సదరు కాంట్రాక్టర్ నిర్లక్షపూరితంగా వ్యవహారిస్తున్నాడని వాహనదారులు వాపోతు న్నారు. కంకర పోసి వదిలేసిన రోడ్డుపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని. తక్షణమే బీటీ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వా ధికారులను స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటీ నిర్మాణం చేపట్టాలని నిరసన

వాతావరణం అనుకూలంగా ఉన్నా పనులు చేపట్టకపోవడం ఏంటని బేగంపేట వాసులు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం బేగంపేట గ్రామ బస్టాండ్ వద్ద బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొందరు స్థానికులు నిరసన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకొని అసంపూర్తి బీటీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయించాలని కోరారు

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి



నవతెలంగాణ-దౌల్తాబాద్ : గ్రామపంచాయతీల నిర్వహణ గ్రామంలోని సమస్యల పరిష్కారానికి మౌలిక వసతులు కల్పనకు నిధులు విడుదల చేయాలని దౌల్తాబాద్ మండలం గ్రామపంచాయతీ కార్యదర్శులు అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీఓ సయ్యద్ గఫూర్ ఖాద్రీలకు నిధులు విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మౌలిక వసతులు కల్పన కోసం సొంత నిధులు ఖర్చు చేశామని తాము ఖర్చు చేసిన నిధులను విడుదల చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లింపుతో పాటు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈనెల 28వ తేదీలోగా డబ్బులు ఇప్పించి కొత్త నిధులు విడుదల చేయాలని లేని పక్షంలో పంచాయతీల నిర్వహణ చేయలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీను, బిక్షపతి, సునీత, సాగర్, రవీందర్, నరేష్, రాజేష్, శ్రవణ్, శ్రీమన్ రెడ్డి, ప్రవీణ్, అర్జున్, మనోజ్, అజయ్ పాల్గొన్నారు.

క్రీడాకారులు రాష్ట, జాతీయ స్థాయిలో రాణించాలి

- మర్కుక్ బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మర్కుక్: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్, మాజీ జెడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు అన్నారు. మండలంలోని దామరకుంట గ్రామంలో గత పది రోజులు అండర్ 16 కబడ్డీ ఆటల ట్రైనింగ్‌ను ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్, కోచ్ నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ వారికి భోజన ఖర్చులను, క్రీడ దుస్తులను మాజీ ఎంపీపీ పాండు గౌడ్, మాజీ జెడ్పీటీసీ రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కరుణా కర్ రెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి బాల్ నర్స య్య, పత్తి బాబు యాదవ్, మాజీ ఉప సర్పంచ్ అంజ నేయులు, తదితరులున్నారు.



సీపీఎస్, యూపీఎస్ రద్దుకు ప్రతి ఒకరం అడిగేద్దాం..

- పాత పెన్షన్ అమలుకై యుద్ధం చేద్దాం
- టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ

నవతెలంగాణ-సిద్దిపేట

సీపీఎస్, యూపీఎస్‌కి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరం ముందుకు అడుగు వేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ అన్నారు. మంగళవారం రాత్రి వయోలా గార్డెన్‌లో టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షులు చేగూరి దేవరాజ్ ఆధ్వర్యంలో యూపీఎస్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ టీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన సీఎం రేవంత్ రెడ్డి హామీని నెరవేర్చలేదన్నారు. ప్రతి ఉద్యోగికి కావాల్సింది సెక్యూరిటీ, సేఫ్టీ దానికి భావజాలాలు, కులాలు సంఘాలు అనవసరమని, పాత పెన్షన్ అమలయ్యే దాకా పోరాటమే తమ ఏకైక ఎజెండా అని అన్నారు. 2004లో వచ్చిన ఎంపీఎస్‌పై ఆనాడు సంఘాలు, మనమందరం మూకుమ్మడిగా దాడి చేసినట్లు ఉండి ఉంటే ఇప్పుడు ఈ పోరాటాల చరిత్ర ఉండేది కాదని గుర్తు చేశారు. మనమందరం కూడా ఏకమై సీపీఎస్, యూపీఎస్‌పై వ్యతిరేకంగా పోరాడితే పాత పెన్షన్ విధానం అమలోకి వస్తుందని, దానికి ప్రతి ఒక్కరు మార్చి 2న ధర్నా చౌక్ వద్ద జరిగే యూపీఎస్, సీపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలన్నా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడుదాం, మన హక్కులను మనం సాధించుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరాకుల శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి శశి యాదవ్, జగదీష్ ప్రవీణ్, సీపీఎస్ సంఘ సభ్యులు, ఉద్యోగ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు



మనసు బాగుంటేనే అలవాట్లు బాగుంటాయి

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



మనసు బాగుంటేనే అలవాట్లు బాగుంటాయని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కోమటిబండ పాండవ కృష్ణ ధ్యానక్షత్రం సప్తమ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ ఏసీపీ పురుషోత్తమ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి వారి వారి స్థాయిలో మానసిక ఒత్తిడి అనేది ఉంటుందన్నారు. అది సహజం దీని అధిగమించాలంటే శారీరకమైన యోగాసనాలతో పాటు మానసికంగా ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న మహాలయ పిరమిడ్ ట్రస్టు సభ్యులను ఏసీపీ అభినందించారు. అలాగే ఈ పిరమిడ్ కోసం ఎకరం స్థలాన్ని ఇచ్చిన కర్నాల కుటుంబ సభ్యులందరినీ శాలువా లువతో సత్కరించమన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో మానసిక సమస్యల తలెత్తినప్పుడు ప్రారంభంలోనే చికిత్సలు తీసుకుంటారన్నారు. మన ప్రాంతంలో చికిత్స తీసుకోవడానికి సంకోచిస్తారన్నారు. ఇలాంటి వ్యతిరేక ధోర ణి మానుకోవాలన్నారు. వారికి నిర్వాహకులు అమృత ఆహా రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, నర్సింలు బాల్ రెడ్డి, రాజిరెడ్డి, పాటు వెంకట్ రావు, స్థల దాతలు కర్నాల కుటుంబ సభ్యులు, దాదాపు 200 మంది ధ్యానులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా 6వ మహాసభను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజయ్ కుమార్

నవతెలంగాణ-కొండపాక



ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఆరో మహాసభల విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం కొండపాక మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులతో వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. కాలేజీ బాత్రూం లో నీరు లేదు. అమ్మాయిలకు సపరేట్గా బాత్రూం లేవని సరి పడా బాత్రూమ్స్ కావాలని కాలేజి చుట్టూ చెట్లు రాళ్ల ఉండ డంవల్ల పాములు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కళాశాలలో పిచ్చి చెట్లు తొలగించాలన్నారు కళాశాల మెయిన్ రోడ్డుకు ఉండడంవల్ల యాక్సిడెంట్ అయ్యే ప్రమాదం ఉందని కాలేజీ ఎదురుగా రెండు స్పీడ్ బ్రేకర్ వేయించాలని అదేవిధంగా ప్రభుత్వ కళాశాలలో ఎంసెట్ కోచింగ్ ఫ్రీగా ఇవ్వాలని కళా శాలలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నిక చేశారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా అనుక్ ఉపా ధ్యక్షులుగా అంజి కార్యదర్శిగా భవాని సహాయ కార్యద ర్శులుగా అనిల్ రాకేష్ కమిటీ సభ్యులుగా రమేష్, ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

నవతెలంగాణ-సిద్దిపేట



విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈనెల 27న జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారితో గెలిపించాలని కోరారు. ఉద్యమాలతో సంబంధం లేని వారు డబ్బు సంచులతో అక్రమ మార్గంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి చూస్తున్నా రన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రయివేటు విద్యాసం స్థలు యజమానులు ప్రయత్నం చేస్తున్నారని, వీరి పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తతతో ఉండాలని, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ పునరుద్ధరణ చేయిస్తామని, 317జీఓ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, కే జీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇప్పిస్తానని, వారికి కనీస వేతన అమలు చేయిస్తామని, పెండింగ్‌లో ఉన్న రూ.4 వేల కోట్ల బకాయిలు, పదవి విరమణ పొందిన వారికి పెన్షనరీ బెన్ఫిట్స్, మంచి ఫిట్మెంట్‌తో పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తానని, గురుకుల పాఠశాల టైంటేబుల్ మార్పిడి చేయిస్తామని, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేసి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 57 ప్రకారం నెలవారీ ప్రమోషన్, అర్హత ఉన్న టీచర్లకు ఎంఈఓ డీఈఓ డైట్ లెక్చరర్ల ప్రమోషన్ ఇప్పిస్తామని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 కింద వేతనాలు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ విజేందర్ రెడ్డి, సుంచు నరేందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరం సహకారం అందిస్తామని సి డి సి సభ్యులు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), గజ్వేల్ ఆధ్వర్యంలో కళాశాల ప్రణాళిక అభివృద్ధి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ వచ్చిన సభ్యుల చేత 2024- 2025 విద్యా సంవత్సరానికి గాను కళాశాల బ్రోచర్ను ఆవిష్కరించారు. కళాశాలకు సంబంధించిన పలు రకాల అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకొని అందులో వారి సహకారం ఈ కళాశాలకు సహకారం అందిస్తామనిసీపీటీసీ మెంబర్‌గా ఉన్న వంటేరు గోపాల్ రెడ్డి అన్నారు. కళాశాల ప్రిన్సిపా ల్ మాట్లాడుతూ.. రానున్న విద్యా సంవత్సరంలో కళాశాల అడ్మిషన్లు పెరగ డానికి కళాశాల వర్గం మరింత కృషి చేస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రాజమౌళి కళాశాలకు మౌలిక వసతులకు కావలసిన అవసరాలను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. కళాశాల సీపీడీసీ కమిటీ కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ.. కళాశాలకి సౌండ్ సిస్టమ్‌ను ప్రధానం చేస్తానని హామీ ఇచ్చారు. ఇతర సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, శ్రీధర్ ల్యాబ్‌లను సందర్శించి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. చివరిగా కళాశాల ప్రిన్సిపాల్ వారిని శాలువాతో సన్మానించారు.

అధ్యాపకుల గొంతుక నర్సిరెడ్డిని గెలిపించుకుందాం..

- టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.తిరుపతి రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుక అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరోసారి గెలిపించుకుందామని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం సాయంత్రం చేర్యాల మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ఉపాధ్యా యులను కలిసి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పనిచేశారని, ఉపాధ్యాయుల పక్షాన నిలబడి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్యాసంస్థల పరి రక్షణ కొరకు శాసన మండలి తోపాటు బయట తన శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. యూఎస్పీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలకు మద్దతుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొని సమస్యల పరి ష్కారం కోసం తన వంతు కృషి చేశారని, తన నియోజకవర్గ అభివృద్ధి నిధులు కింద ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని పాఠశాలలకు, కళాశాలకు అవసరమైన భవనాలు నిర్మాణానికి పూర్తిస్థా యిలో కేటాయించడమే కాకుండా సకాలంలో విని యోగించడం జరిగిందన్నారు. కరీం నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్ని కల్లో ఉమ్మడి అభ్యర్థి వై.అశోక్ కుమా ర్ ఉపాధ్యాయ ఎమ్మె ల్సీగా పోటీ చేస్తున్నారని, అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులు పోటీ చేస్తున్నారని వారి వల్ల ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆరోపించారు.

ధనస్వామ్యాన్ని ఓడించండి.. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడండి

ధనస్వామ్యాన్ని ఓడించండి విద్యారంగాన్ని కాపాడండి అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని, ప్రభుత్వ విద్యారంగంలో భాగస్వాములై, వ్యవస్థ నిర్మాణం కోసం ఎన్నో పోరాట కార్యక్రమాలు చేసిన ఖమ్మం-నల్గొండ-వరంగల్ శాసనమండలి నియోజకవర్గంలో అలుగు బెల్లు నర్సిరెడ్డిని, కరీంనగర్ శాసనమండలి ఎన్నికల్లో వై.అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఉపాధ్యాయ, అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాంరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, యూఎస్పీసీ భాగస్వామ్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి.వెంకటరమణ, పిల్లి రాజు, పి.హనుమారెడ్డి, బి.చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కొండపాక : కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షులు నూనె కుమార్ అందజేశాడు. గ్రామానికి చెందిన షేక్ మదార్‌కు రూ.58,500, గాజుల పాటి మధుకు రూ 14.500ల చెక్కు లు అందచేశారు.



హరీశ్‌రావు చేయని పనులను కాంగ్రెస్ చేస్తోంది



నవతెలంగాణ-నంగునూరు: హరీశ్ రావు పదేండ్ల నుంచి పూర్తి చేయని సాగు నీళ్ల కాలువల పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పూర్తి చేస్తున్నామని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. మంగళవారం నంగునూరు మండలం సిద్దన్నపేట రైతులతో కలిసి ఎర్రకుంట, ఇప్పలకుంట చెరువులోకి నీళ్లు వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువను తవ్వించారు. గత పాలకులు పట్టించుకోకుండా పోవడం మూలాన ఈ రెండు చెరువులకు నీళ్ల వెళ్లే కాలువలను పూర్తిగా తవ్వకుండ మధ్యలోనే వదిలేసి రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల్లో నీళ్ల లేక భూగర్భ జలాలు అడుగంటి వరిచేండ్లు, మామిడి తోటలు ఎండుతున్నాయని రైతులు మాకు చెప్పడం జరిగిందని పేర్కొన్నారు వెంటనే నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తక్షణమే స్పందించి సంభందించిన అధికారులతో మాట్లాడారని చెప్పారు. కాలువలలో వచ్చిన పరుపు బండను తొలగించడానికి కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో అనుమతులు ఇప్పించడం జరిగిందని తెలియజేశారు. వెంటనే ఆ బండలను తొలగించి శాశ్వత పరిష్కారం చెయ్యాలని భారినీటి పారుదల జిల్లా అధికారులతో మాట్లాడడం జరిగిందని పేర్కొన్నారు. సాగు నీళ్ళను అస్తవ్యవస్థం చేసిన హరీశ్ రావు సమస్యలు సృష్టించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదునాం చేయాలని కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో చెరువులలోకి నీళ్ల వెళ్లకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పదేండ్ల నుంచి పనులు పూర్తి చేయని హరీశ్‌రావు ఇప్పుడు సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అచ్చిన సత్తయ్య, బాగు శ్రీకాంత్ యాదవ్, ముస్త్యాల యాదగిరి,గోనెపల్లి శివ, చిలుక శేఖర్ రెడ్డి, అనరాజు గణేశ్, బాపూరావు, కైలాశ్, మనోహర్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలి

నవతెలంగాణ-సిద్ధిపేట :హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాల ని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఉన్న బీసీ హాస్టల్ సందర్శించి, అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఉగాద సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు నెలల నుంచి కాస్మోటిక్ చార్జర్ రావడం లేదని విద్యార్థులు తెలిపారని, విద్యార్థులు మానసికంగా దృఢపడడానికి క్యారం చెస్ లాంటి ఆటలు ఆడుకోవడానికి వసతులు కల్పించాలని, దోమల నివారణకు ఏర్పాట్లు చేయాలని కోరారు.



ఫిబ్రవరి 19

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

తెలుగు వెలుగు

సీ!!

ఏ బదార క్ష రాలీ పదారు కళల
బంగారు బొమ్మకు వర్ణమాల
కంఠ హారమ్ముగా కైసేతు మెడలోన
తొలి తెలుగు కోహినూరు తలుకు లీన
పరషాల బిగిలోని పగడాల రతనాల-ల
జిలుగు మంజీరాల చెన్ను చూడ
సరళాలు విరివిగా చక్కగా విరచించి
సంజ కెంపుల చెవి చౌక లింక

తే గీ!!
ఉష్మ దంత్యోష్య పలుకుల నుచ్చరింప
వజ్ర ఖచితమ్ము నాసికా భరణి చెవికి
కంఠతాలవ్య ధ్వనులు నిష్కాస మగ
క్రీ పెదవి జారు తెలుగింటి కీరవాణి!!



-గొల్లపల్లి రఘు రామ శర్మ
-ఎస్ఏ తెలుగు
-జెడ్పీహెచ్ఎస్
అంకిరెడ్డిపల్లి
-మండలం.
కొండపాక
-జిల్లా. సిద్దిపేట
-9989149454

వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



నవతెలంగాణ-రాయపోల్

వరి పొలాలను పరిశీలించి తెగులు సోకిన పంటలకు పలు సూచనలు చేస్తూ రైతులందరూ తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద పంట నమోదు చేసుకోవాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంసాగార్ గ్రామానికి చెందిన వరి పొలాలను, పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేసే వరి పంటలో కొన్ని చౌడు భూమిలో వరి ఎర్రభారి వేసిన కర్ర వేసేనట్లు ఉండి పొలం అంతా బుడ బూడగా ఉండి వరి వేర్లు నల్లగా మారి భూమి లోపలి పోషకాలు తీసుకోకపోవటం వలన జింక్, ఇతర పోషకాల లోపాలు కనిపిస్తాయి. దీని నివారణకు 19.19.19 ఒక కేజీ ఎకరానికి, జింక్ సల్ఫేట్ 400-500 గ్రాములు ఎకరానికి రెండు సార్లు పిచికారి చేసి, పొలం బాగా నెర్రలు వచ్చే లాగా ఆరబెట్టాలన్నారు. ప్రస్తుతం యాసంగి కాలంలో జింక్ లోపాలు ఎక్కువ కనిపించే అవకాశం ఉందని, జింక్ నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం గ్రామాలలో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, స్వర్ణలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

5

నవ్యత తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 19 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలి

-తొగుట ఎస్ఐ రవికాంత్ రావు



నవతెలంగాణ-తొగుట

ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయని తొగుట ఎస్ఐ రవి కాంత్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని సూచంచారు. ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని తెలిపారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించినట్లయితే, ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

బిల్లులో వసూళ్లపై శ్రద్ధ పెట్టండి



నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపాలిటీలో పెండింగ్లో ఉన్న ఇంటి పన్నులు, ట్రేడింగ్ లైసెన్సులు, నల్ల బిల్లుల వసూల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిషనర్ గోల్కొండ నరసయ్య అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పూర్తిస్థాయిలో లైసెన్సులు, ఇంటి పన్నులు, నల్ల బిల్లులు చేయాలని కోరారు. 2024-25 గాను బిల్లులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణానికి చెందిన సుద్దాల కన్నయ్యకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్య మంత్రి సహాయనిధి రూ.28 వేల 500ల చెక్కును మంగళవారం వారి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల ఇంచార్జ్ శివగారి అంజయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ పట్టణ అధ్యక్షుడు యాట బిక్షపతి, రాము, మాజీ ఉపసర్పంచ్ జంగిటి బిక్షపతి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ నేటి యువతకు ఆదర్శనీయం

నవతెలంగాణ-దుబ్బాక



అణగారిన వర్గాల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తూనే వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన మాదరి భాగ్యరెడ్డి వర్మ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆస రవి అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతి సందర్భంగా మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆస దశరథం, కృష్ణ, బండ నర్సింలు, నరేష్, గణేష్, యాదగిరి పాల్గొన్నారు.

దళిత ఆత్మగౌరవ పతాకం భాగ్యరెడ్డి వర్మ

-డీబీఎఫ్ రాష్ట్రకార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ-గజ్వేల్



మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌ల కంటే ముందే అస్పృశ్యత నివారణకై, సంఘసంస్కర్త, నిమ్న జాతి జీవన వికాస భాగ్యరేఖ, తెలంగాణ గడ్డపై ఉదయించిన భాగ్యోదయం మన మాదరి వేంకట భాగ్యరెడ్డి వర్మ 86 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గజ్వేల్ అంబేద్కర్ భవన్‌లో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అధ్వర్యంలో ఆయన ప్రతిమకు పూలతో ఘనంగా నివాళ్ళులర్పించి ఆయన సేవలు కొనియాడారు. 1888 మే 22న దళిత నిరుపేద కుటుంబంలో పుట్టిన భాగ్యరెడ్డి వర్మ పేరుమార్చుకొని, తన ఇంటికి వచ్చిన అన్ని పత్రికలను చదివి, రావిచెట్టు రంగారావు ప్రోత్సాహంతో వర్మ ఎన్నో పుస్తకాలు చదివి విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషలు నేర్చుకున్నారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో లండన్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి నిమ్నజాతి తరపున ప్రతినిధిగా అంబేద్కర్ పేరును సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నియోజకవర్గ నాయకులు మాసన్ పల్లి మైసయ్య,శ్రావణ్, లింగం, శేఖర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మరియమ్మకు నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు




నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం నందారం గ్రామానికి చెందిన మన తెలంగాణ రిపోర్టర్ లింగాల ప్రవీణ్ నానమ్మ లింగాల మరియమ్మ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెసరి సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు బీలు నాయక్ హాజరై సోమవారం ఆమె మృతదేహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్, పార్టీ నాయకులు అజ్మీర తిరుపతి, తదితరులు, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారిన వేళ

-బుస్సాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారారు. మంగళవారం సిద్ధిపేటరూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ జిల్లా ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు జిల్లా విద్యాశాఖ అధికారిగా భవ్య శ్రీ, మండల విద్యాశాఖ అధికారిగా సాయి స్మిత ,పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విజయ్, వ్యాయామ ఉపాధ్యాయులుగా చందు, అజిత్ కుమార్లు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివా స్ మాట్లాడుతూ.. విద్యార్థులు స్వయం అనుభవం క్రమశిక్షణ అలవాటు పడుతా యని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకట్ నర్సారెడ్డి, మంజు లవాణి, నగేష్, వనజ, గోపాల్, శ్రీకాంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పడిపోతున్నా భూగర్భ జలాలు



- వేసవిలో మరింత తగ్గే అవకాశాలు
- జిల్లాలో సాగు, తాగు నీటికి ప్రాజెక్టుల్లో ఉన్న నీరు ఆధారం

నవతెలంగాణ-సిద్ధిపేట

వేసవికాలం ఇంకా మొదలవక ముందే ఇప్పుడే జిల్లాలో భూగర్భ జలాల మట్టాలు పడిపోతున్నాయి. బోర్లలో నీళ్లు ఇంకిపోతున్నాయి. యాసంగిలో బోరుబావుల కింద సాగుచేస్తున్న పంటలకు నీటి కోసం కటకట తప్పని పరిస్థితి కనిపిస్తోంది. డిసెంబర్‌లో 9.64 మీటర్ల లోతుగా ఉన్న సగటు భూగర్భ జలమట్టం జనవరిలో 10.85 మీటర్ల లోతుకు తగ్గిపోయింది. అంటే నెల రోజుల్లోనే సుమారు 1.21 మీటర్ల మేర భూగర్భజల మట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. వ్యవసాయం, ఇతర అవసరాలకుతోడు తాగునీటి కోసం వేసవిలో వినియోగం మరింత పెరగనుండటంతో రానున్న రోజుల్లో భూగర్భ జలమట్టాలు మరింతగా పడిపోయే అవకాశం కనిపిస్తోంది.

గత ఏడాదితో పోలిస్తే..

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో గత సంవత్సరం జనవరిలో ఉన్న భూగర్భ జలాలు ఈ సంవత్సరం జనవరిలోనే భూగర్భ జలాలను పరిశీలిస్తే నీటిమట్టాలు మరింత లోతుకుపోయినట్లు తెలుస్తుంది. 2024 జనవరిలో జిల్లా సగటు 8.96 మీటర్ల లోతులో ఉండగా, ఈ సంవత్సరం జనవరి నెలలో 10.85 మీటర్ల లోతులో నీరు ఉన్నది. 1.89 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. జిల్లాలో కొమురవెల్లి, మర్కుక్ మండలలో మాత్రమే కొంత గత సంవత్సరము కంటే ఈ సంవత్సరం వర్షపాతం ఎక్కువగా నమోదయింది. ఈ విషయం ఆందోళన పరిచే అంశమే.

ప్రభుత్వం ముందు ఆలోచన అవసరం..

జిల్లాలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, గౌరవెల్లి, శనిగరం ప్రాజెక్టులు ఉన్నప్పటికీ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం భూగర్భ జలాలు తగ్గడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న అంశమే. ప్రభుత్వం నీటి వనరులపై ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని ప్రాజెక్టులను కాళేశ్వరం నీటితో నింపుతూ, ప్రాజెక్టుల కింద ఉన్న చెరువులను కూడా పూర్తిస్థాయిలో నింపితే భూగర్భ జలాలు పెరిగే అవకాశంతో పాటు, ఎండాకాలంలో పంటలు కూడా నష్టపోకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి.

పడిపోయిన నీటిమట్టాలు..

మండలము నీటిమట్టం	జనవరి-24	జనవరి-25	తగ్గిన
అక్కన్నపేట	11.36 (మీటర్స్)	11.43	-0.07
అక్బర్‌పేట- భూంపల్లి	11.25	14.87	-3.62
బెజ్జంకి	6.64	8.20	-1.56
చేర్యాల	7.12	8.73	-1.61
చిన్నకోడూరు	8.25	10.25	-2.00
దౌల్తాబాద్	18.50	22.38	-3.88
దుల్మిట్ట	12.07	13.72	-1.65
దుబ్బాక	17.77	20.95	-3.18
గజ్వేల్	10.45	13.73	-3.28
హుస్నాబాద్	4.81	6.89	-2.08
జగదేవ్‌పూర్	7.61	9.99	-2.38
కోహెడ	3.49	3.95	-0.46
కొమురవెల్లి	5.60	5.56	0.04
కొండపాక	5.29	7.25	-1.96
కుకునూర్‌పల్లి	10.89	16.87	-5.98
మద్దూరు	7.16	8.09	-0.93
మార్కూక్	13.68	13.56.	0.12
మిరుదొడ్డి	12.95	17.89	-4.94
ములుగు	16.24	16.43	-0.19
నంగనూరు	7.87	8.83	-0.96
రాయపోల్	13.50	14.77	-1.27
సిద్దిపేట (రూరల్)	12.17	13.69	-1.52
సిద్దిపేట (అర్బన్)	9.12	12.48	-3.36
తొగుట	7.93	10.10	-2.17
వర్గల్	4.45.	8.01	-3.56
జిల్లా సగటు నీటిమట్టం	8.96	10.85	-1.89

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



నవతెలంగాణ-కోహెడ

విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంతో చదవడం అలవాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంను సందర్శించి పరిశుభ్రత, టాయిలెట్స్ నిర్వాహణ, వంట సామాగ్రి నిలువ, తరగతి గదుల నిర్వాహణ, భోజన వసతుల ఏర్పాటు, విద్యార్థుల ఆరోగ్యం, నీటి సరఫరా, వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంటు నిర్వాహణ, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్థులు పది జీపీఏ సాధించే దిశగా విద్యనభ్యసించాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఫార్మెటీవ్, సమ్మెటీవ్, ప్రాక్టీస్ చేస్తూ మంచి మార్కులు సాధించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులను మౌళిక వసతుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తంగళ్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని . ఈ కార్యక్రమాలలో జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్, తహసీల్దార్ సురేఖ, వైద్యాధికారిణి నిమ్రా, మండల విద్యాధికారి పద్మయ్య, ఇంఛార్జీ ఎంపీవో శోభ, సీడీపీవో జయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, పంచాయతీ కార్యదర్శి రమేష్, సీఆర్పీ రాజేశం, అంగన్‌వాడీ టీచర్‌లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయండి

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల పట్టభద్రుల సమావేశం ఉంటుందని నరేందర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, కోఆర్డినేటర్ గుత్తా అమిత్ రెడ్డి, తెలంగాణ డైరీ డెవలప్మెంట్ చైర్మెన్ వారితో పాటు మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తదితరులు వస్తున్నట్లు చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తలు నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు పట్టభద్రులు మీడియా మిత్రులు అందరూ ఈ సమావేశానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, సుకెందర్ రెడ్డి, నక్క రాములు, గుంటుకు శ్రీను, సమీర్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్షిప్పు అందజేత



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థినీలు యాట అశ్విని ఎంపీసీ సెకండియర్, గదరాజు పల్లవి బీపీసీ సెకండియర్, కాసర్ల అనుష్క బీపీసీ సెకండియర్, కెమ్మ సారం బాల లక్ష్మీ బీపీసీ ఫస్ట్ ఇయర్, బాలగోని మహాలక్ష్మి ఎంపీసీ ఫస్ట్ ఇయర్, మల్లం శిరీష ఎంపీసీ ఫస్ట్ ఇయర్, నీల అర్చన ఎంపీసీ ఫస్ట్ ఇయర్ యాస వేని రాజేశ్వరి సీఈసీ సెకండ్ ఇయర్, సైని బీపీసీ ఫస్ట్ ఇయర్‌లు సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో మలబార్ గోల్డ్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరు రూ.10 వేలు స్కాలర్షిప్ప అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. జ్యోతి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు ప్రతి సంవత్సరం మలబార్ గోల్డ్ ట్రస్టు స్కాలర్షిప్ప అందజేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బాలికలు, తల్లిదండ్రుల్లో ఆనందోత్సవం వెల్లివిరిసిందన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాలు ఉంటే చాలా మంది విద్యార్థినిలు కళాశాలలో చదువుకోవడానికి ముందు కు వస్తారని పిల్లల తల్లిదండ్రులు అభిప్రాయ పడ్డట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఏ. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. మధు, అధ్యాపకులు పరశురాములు, విద్యాసాగర్, శ్రీధర్, రవి, కవి త, స్వప్న శ్రీదేవి, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

కంది రైతులపై కేంద్రం వివక్ష

- నిబంధనలతో రైతుల సతమతం
- మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కంది పంట సాగు చేసి కందులను అమ్ముకుంటున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కందులను మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు చేస్తూ ఎకరానికి మూడు క్వింటాళ్ల 30 కేజీలు కొనుగోలు చేస్తుందన్నారు. దీంతో పంట దిగుబడి ఎక్కువ వచ్చిన రైతులు దళారులకు అమ్మే పరిస్థితి నెలకొందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎకరానికి ఏడు క్వింటాళ్ళ కొనుగోలు చేయాలని ఎన్నోసార్లు కలెక్టర్‌కు విన్నవించా మని తెలిపారు. కంది రైతులకు ఆన్లైన్ సమస్యలు, ఎకరానికి మూడు క్వింటాళ్ల 30 కేజీల కొనుగోలు నిబంధనలు పెట్టి రైతులను కేంద్ర ప్రభుత్వం ఇబ్బందుల గురి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వ మంత్రులు స్పందిం చాలన్నారు. రైతులకు కొనుగోలు చేయుటకు రిజిస్ట్రేషన్ కాకపోతే తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ చేయిస్తామని రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదని అన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, డైరెక్టర్లు తనకు ఆంజనేయులు, తేరాల మారుతి పోతుగంటి బాలయ్య డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వేల్పుల దేవయ్య జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శం

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు యాదగిర్ది

నవతెలంగాణ-మద్దూరు



కామ్రేడ్ వేల్పుల దేవయ్య, జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శమని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, అన్నారు. మంగళవారం మండలంలోని వల్లంపట్ల గ్రామంలో వేల్పుల దేవయ్య 9వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి వారి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవయ్య చిన్నతనం నుంచి అనేక కష్టాలు బాధలు అనుభవించి పొట్ట చేత పట్టుకొని సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతానికి వెళ్లి కూలినాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. తనలాగా గూడు నీడ లేక అనేక మంది నిరాశ్రయులుగా ఉన్న వారిని చూసి సీపీఐ(ఎం) ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలు పడుతున్న బాధలను చూసి అడ్డగుట్ట ప్రాంతంలో పేద ప్రజలతో గుడిసెలు వేయించి అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించారన్నారు. ప్రభుత్వాల మెడలు వంచి పేద ప్రజలకు పక్కా ఇండ్లు ఇప్పించిన వ్యక్తి అని ఆయన తెలిపారు. అంతేకాకుండా సిపిఎం నిర్వహించే అనేక ప్రజా ఉద్యమాలు పోరాటాలలో చురుకైన కార్యకర్తగా తన బాధ్యతను నిర్వర్తించి క్రమశిక్షణ కలిగిన నాయకుడుగా చివరి వరకు ఎర్రజెండా బిడ్డగా నీతి నిజాయితీగా ప్రజల కోసం పార్టీ కోసం బ్రతికి సిపిఎం కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని అలాంటి వ్యక్తి జీవితాన్ని సీపీఐ(ఎం) కార్యకర్తలు ఆదర్శంగా తీసుకుని తన ఆశయాలను కొనసాగించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కామ్రేడ్ గుళ్ళ భీమయ్య ,సిద్దులు,కనకయ్య, వారి కుటుంబ సభ్యులు వేల్పుల లలిత వేల్పుల ప్రభాకర్ ,వేల్పుల సుధాకర్ ,స్వర్ణలత ,జ్యోతి ,బాలు తదితరులు పాల్గొన్నారు.

కొన్ని శక్తులు దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి

- చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

దేశంలో ఉన్న కొన్ని శక్తులు, విదేశాల వారితో కలిసి దేశాన్ని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులే దొరకలేదని, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మాత్రమే పోటీలో ఉన్నారని, దీంతో వారు చేతులెత్తేసారని అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఏమి ఇచ్చారని ఆరోపిస్తున్న వారు కొంచెం ఆలోచించాలని, అవసరం లేకున్నా తెలంగాణ రైతుల నుంచి రూ.24 వేల కోట్ల విలువగల వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, యూరియాకు సబ్సిడీ ఇస్తున్నారని, రూ.6వేల సహాయం అందిస్తున్నారని, ఒక రైతుకు సుమారుగా రూ.60 నుంచి రూ.70 వేల సాయం అందిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమురయ్య, పట్టపద్రులు ఎమ్మెల్సీగా అంజి రెడ్డిలు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు బీజేపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామచంద్రరావు, విద్యాసాగర్, మల్లారెడ్డి, రత్నం, విభీషణ్ రెడ్డి, నరేష్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

20న ఛలో విద్యుత్ సౌదను జయప్రదం చేయండి






నవతెలంగాణ-తొగుట

ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి రాగానే మీకు పూర్తిస్థాయిలో పర్మనెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని టీఈఈయు గజ్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సిరినేని భూపతి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్ నోట్ ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తున్న క్రమంలో విద్యుత్ సంస్థలో ఉన్న కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం దాటినా మమ్మల్ని పట్టించుకోలేదని అవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలో ఉన్న సంఘాలను కలుపుకొని జేఏసీగా ఏర్పడి తెలంగాణలో ఉన్న ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, అలాగే విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క లకు చాలా సందర్భాల్లో మెమోరండం ఇచ్చామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జనవరి నెల 20వ తేదీ నుండి 24 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఐదు రోజులు రిలే దీక్షలు నిర్వహించామని చెప్పారు. అలాగే ఉమ్మడి జిల్లా ల్లో కన్వర్షన్ యాత్రను నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేని పక్షంలో ఈ నెల 20న ఛలో విద్యుత్ సౌదను 20వేల మందితో మెమోరడం ఇవ్వడం కోసం పిలుపునిచ్చామన్నారు. కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ-తొగుట/గజ్వేల: చలో విద్యుత్ సౌదాను ముట్టడి విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ సిద్ది పేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దూలం యాదగిరి గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 20 వేల మంది తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ లను కన్వర్షన్ చేయాలని కోరుతూ ఈనెల 20న టీవీఏసి జెఏసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో విద్యుత్ సౌదాను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రం ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లో కన్వర్షన్ చేయాలని వారి విద్యా అర్హతను బట్టి వారికి సబ్ ఇంజనీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, పోస్టులను ఇవ్వాలని అనేక దఫాలుగా పోరాటాలు నిర్వహించామన్నారు. గతంలో కూడా విద్యుత్ శాఖ మంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రికి దృష్టికి కూడా ఆర్టిజన్ సమస్యలను తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వం, మేనేజ్మెంట్ నుంచి ఎలాంటి స్పందన లేనందున విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. దీనికి ఆర్టిజన్ కార్మికులు, యూనియన్‌లకు తరలిరావాలని కోరారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ వెంటనే చేయాని యెడల హైదరాబాద్‌లోని విద్యుత్ సౌదాను కార్యక్రమం జరుగుతుందని టీవీఏసి జేఏసీ ఉమ్మడి మిరుదొడ్డి మండల అధ్యక్షుడు అన్నెబోయిన నారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లో కన్వర్షన్ చేయాలని వారి విద్యా అర్హతను బట్టి వారికి సబ్ ఇంజనీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, పోస్టులను ఇవ్వాలని అనేక దఫాలుగా పోరాటాలు నిర్వహించా మన్నారు. గతంలో కూడా విద్యుత్ శాఖ మంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రికి దృష్టికి కూడా ఆర్టిజన్ సమస్యలను తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వం, మేనేజ్మెంట్ నుంచి ఎలాంటి స్పందన లేనందున ఈనెల 20న ఛలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. దీనికి ఆర్టిజన్ కార్మికులు, యూనియన్‌లకు అతితంగా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. దీనికి ఆర్టిజన్ కార్మికులు, యూనియన్‌లకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్ : విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలంటూ ఈనెల 20న హైదరాబాద్ విద్యుత్ సౌదా ముట్టడి ధర్నాను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా జేఏసీ సంయుక్త కార్యదర్శి రవికుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ పోస్టుల్లో కన్వర్షన్ చేయాలని వారి విద్యా అర్హతను బట్టి సబ్ ఇంజనీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి ఆర్టిజన్ సమస్యలను తీసుకెళ్లామని తెలిపారు. అయిన ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సౌదాను 20 వేల మంది కార్మికులతో ముట్టడి చేసి ధర్నా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు.